అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

వరంగల్-హనుమకొండ

ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్

సమగ్ర తెలుగు దినపత్రిక



08 పేజీలు | శుక్రవారం 08 మార్చి 2024 | www.navatelangana.com

ప్రతి రంగంలోనూ మహిళలు ముందుండాలి



మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శు భాకాంక్షలు : టీఎన్జీఓఎస్ ములుగు జిల్లా కార్యదర్శి, మహిళా విభాగం అధ్యక్షురాలు మేడి చైతన్య

నవతెలంగాణ - ములుగు

'ప్రతి రంగంలోనూ మహిళలు ముందుండాలి. ముందుగా మహిళలందరికీ 111వ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.' అని టీఎన్జీఓఎస్ ములుగు జిల్లా కార్యదర్శి, మహిళా విభాగం అధ్యక్షురాలు మేడి చైతన్య తెలిపారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దోనోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో ముచ్చటించారు. వివరాలు ఆమె మాటల్లోనే... మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దినోత్సవమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం. మహిళా కష్టానికి గుర్తింపుగా ఈ ప్రత్యేక దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. ఇది ఒక కార్మిక ఉద్యమం నుంచి పుట్టుకొచ్చిన విషయం అందరికి తెలిసిందే. ఎంతో మంది మహిళలు వారి హక్కుల కోసం పోరాటాలు చేసిన ఫలితమే అంతర్జాతీయ మహిళా దినో త్సవం. భారతదేశం పురుష ఆధిక్యత దేశం అని మనందరికీ తెలుసు. నాటికీ పురుషుల కంటే మహిళలకు తక్కువ అవకాశాలు, గౌరవం లభించేది. కానీ కాలక్ర మేనా మహిళలు అన్ని రంగాలలో వారికి వారు సమర్థు లుగా మలుచుకొని అన్ని రంగాలలో ముందుంటున్నారు. మహిళలు ఇటు ఇంటి బాధ్యతలను నిర్వహించడంతో పాటు అటు ఉద్యోగ బాధ్యతలు చురుకుగా నిర్వహిస్తున్నారు. మనదేశంలో ముఖ్యమంత్రులుగా, ప్రధాన మంత్రులుగా, రాష్ట్రపతులుగా, గవర్నర్లుగా, కలెక్టర్లుగా, ఆర్మీ, నేవీ, పోలీస్ డిపార్ట్మెంట్, వివిధ శాఖలలో మగవారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు 23 సెప్టెంబర్ 2023న కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టింది. 27 సంవత్సరాల కాలయాపన తర్వాత ఈ బిల్లు ఆమోదించారు. మహిళా దినోత్సవం-2024 పురస్కరించుకొని ములుగు జిల్లాలో పనిచేసే మహిళా ఉద్యోగులందరికీ క్రీడా పోటీలు నిర్వహించాం. ప్రతి ఒక్కరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. గెలుపొందిన వారికి మహిళా దినోత్సవం రోజున బహుమతులు కూడా అందజేస్తున్నట్టు మేడి చైతన్య వివరించారు.



ఉమ్మడి వరంగల్‌లో వెల్లివిరిసిన మహిళా చైతన్యం

2వ పేజీలో

మంత్రులు, అధికారులూ.. అందరూ..

ఫైర్ బ్రాండ్‌గా సురేఖ

నాడు అజ్ఞాత నేత

నేడు జన నేతగా సీతక్క

మూడు జిల్లాలకు మహిళా కలెక్టర్లే.

ఉమ్మడి వరంగల్‌లో వెల్లివిరిసిన మహిళా చైతన్యం

మంత్రులు, అధికారులూ.. అందరూ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహిళలు ఇటీవలి కాలంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పాలనలో కీలకపాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా నుండి ఇద్దరూ మహిళా మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండడం విశేషం. మూడు జిల్లాలకు కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు సైతం మహిళా అధికారులే కావడం గమనార్హం. ఇదిలావుంటే ప్రజాప్రతినిధుల్లో నాలుగు జిల్లాలకు జెడ్పీ ఛైర్‌పర్సన్‌లుగా మహిళా నేతలే ఎన్నికవడం .. ఇలా ఉమ్మడి జిల్లా పాలనలో అతివలు అటు రాజకీయాల్లో, ఇటు పాలనలో తమదైన పాత్ర పోషిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి గురించి మరోసారి మననం చేసుకోవడం అవశ్యం.

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ రంగంలో చైతన్యపూరితమైన వాతావరణముంది. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు ముగిశాక నూతన మంత్రివర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరు మహిళా నేతలు మంత్రులవడం గమనార్హం. ఈ ఇద్దరు మంత్రుల రాజకీయ నేపథ్యం సంచలనాత్మకమైనదే కావడం, వారిద్దరూ భిన్నమైన శైలిలో ఎదిగిన ప్రజాప్రతినిధులు కావడం గమనార్హం. రాజకీయాల్లో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్కలది ఎవరి శైలి వారిదే.. ఇదిలావుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో హన్మకొండ, వరంగల్, ములుగు జిల్లాల్లో కలెక్టర్లు సైతం మహిళా అధికారులే వుండడం గమనార్హం. అడిషనల్ కలెక్టర్లుగా మహిళా అధికారులు పనిచేస్తున్నారు.

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి





మూడు జిల్లాలకు మహిళా కలెక్టర్లే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో హన్మకొండ, వరంగల్, ములుగు జిల్లాలకు మహిళలే కలెక్టర్లుగా పని చేస్తుండడం విశేషం. హన్మకొండ జిల్లాకు కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ జిల్లాకు కలెక్టర్‌గా పి. ప్రావీణ్య, ములుగు జిల్లాకు కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి పని చేస్తున్నారు. పి. ప్రావీణ్య గతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గానూ విధులు నిర్వహించారు. ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ములుగు జిల్లాలోనే గతంలో అడిషనల్ కలెక్టర్‌గా విధులను నిర్వహించడం గమనార్హం.






జడ్పీ ఛైర్‌పర్సన్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6 జిల్లాల్లో 4 జిల్లాలకు జడ్పీ ఛైర్‌పర్సన్‌లు మహిళా నేతలే ఎన్నికవడం గమనార్హం. వరంగల్ రూరల్ జిల్లాకు గండ్ర జ్యోతి, మహబూబాబాద్ జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఆంగోతు బిందు, ములుగు జిల్లాకు జడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఎన్నికవడం విశేషం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ కల్లెపు శోభ వ్యవహరిస్తున్నారు. ములుగు జడ్పీ ఛైర్మన్‌గా ఎన్నికైన కుసుమ జగదీశ్ అకాల మృతి నేపథ్యంలో బడే నాగజ్యోతి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.






అడిషనల్ కలెక్టర్లుగా మహిళలే..

వరంగల్, హన్మకొండ, ములుగు జిల్లాల్లో అడిషనల్ కలెక్టర్లుగా ఎక్కువ మంది మహిళా అధికారులే పనిచేస్తున్నారు. వరంగల్ జిల్లాలో అడిషనల్ కలెక్టర్లుగా జి. సంధ్యారాణి, అశ్వినీ తానాజీ వాఖడే, హన్మకొండ జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌గా రాధికా గుప్తా, ములుగు జిల్లాలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా శ్రీజ పని చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటు ప్రజాప్రతినిధులు, ఇటు పాలనలో ఉన్నతాధికారులు సైతం అధికంగా మహిళలే పనిచేస్తుండడం విశేషం.

ఫైర్ బ్రాండ్ సురేఖ..

ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లోనే కాదు.. ఏకంగా రాష్ట్ర రాజకీయాల్లోనూ మంత్రి కొండా సురేఖ ఫైర్ బ్రాండ్ అనే విషయం అందరికీ తెలిసిందే. రాజకీయాల్లో ఎంపీపీ నుండి మంత్రి స్థాయికి ఎదిగిన నేత. సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు తోడ్పాటుతో ఆమె రాజకీయంగా అంచలంచెలుగా ఎదిగారు. 'కొండా' దంపతులకు ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానముంది. సురేఖ మాటనే తూటగా పేలుతుందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తుంటారు. నిర్మొహమాటంగా, సూటిగా విమర్శలు చేయడంలో ఆమెకు ఆమె సాటి. నాడు వైఎస్‌కు, నేడు సీఎం రేవంత్‌కు ఆమె అత్యంత ఆప్తురాలు కావడం, ఆమె పదునైన మాటలను ఈ ఇద్దరూ నేతలు ఇష్టపడడం వల్లే మంత్రిగా ఆమె అవకాశాలను దక్కించుకుందని రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. 1995లో తొలిసారి గీసుగొండ ఎంపిపిగా ఎన్నికైన సురేఖ 1999లో మొదటిసారి శాయంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999, 2004, 2009లో వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్ మంత్రివర్గంలో సురేఖ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. వైఎస్ మృతి అనంతరం 2011లో మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పరకాల నియోజకవర్గంలో 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్సీపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కొండా సురేఖ 2014లో టిఆర్‌ఎస్‌లో చేరి వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2018లో టిఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. 2018లో పరకాల నుండి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తాజాగా 2023లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. కొండా సురేఖ శాయంపేట, పరకాల, వరంగల్ తూర్పు నియోజకవర్గాల నుండి శాసనసభ్యురాలిగా ఎన్నికైన సీనియర్ రాజకీయ నేత కావడం విశేషం. చెప్పాలనుకున్న విషయాన్ని ముక్కుసూటిగా చెబుతుందన్న పేరు వుంది. మంత్రి సురేఖ అటు సోనియాగాంధీకి, ఇటు సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడం గమనార్హం.



నాడు అజ్ఞాత నేత.. నేడు జననేతగా సీతక్క

14 ఏండ్ల వయస్సులోనే జనశక్తి దళంలో చేరి పనిచేసిన ధనసరి అనసూయ సీతక్క పేరుతో అటవీ ప్రాంతంలో పనిచేసింది. 11 ఏళ్లు అజ్ఞాతంలో వుండి నక్సలైట్‌గా జీవితాన్ని గడిపిన సీతక్క ఎట్టకేలకు 1997లో లొంగి పోయి జనజీవన స్రవంతి లోకి వచ్చింది. నాటి నుండి ఒకవైపు ఉన్నత విద్య నభ్యసిస్తూ మరోవైపు రాజకీ యాల్లో కీలకపాత్ర పో షించారు. టిడిపిలో చేరిన సీతక్క 2004లో తొలిసారి ములుగు నియోజకవర్గం నుండి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయారు. అనంతరం సీతక్క 2017లో కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డితోపాటు చేరారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం



సాధించారు. తిరిగి 2023లోనూ ములుగు నియోజకవర్గం నుండి భారీ మెజార్టీతో విజయం సాధించారు. న్యాయశాస్త్రంలో పట్టా పొందిన సీతక్క రాజనీతి శాస్త్రంలో పరి శోధన చేసి డాక్టర్ పట్టా అందుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన అనసూయ అజ్ఞాతంలో సీతక్క పేరుతో పనిచేసినా, రాజకీయాల్లోకి వచ్చాక కూడా అనసూయ సీతక్కగానే ప్రాచుర్యం పొందారు. పేదలకు సేవ చేయాలనే తలంపుతో కోవిడ్ సందర్భంలో ఎవరికి వారే ప్రాణాలను కాపాడుకోవడానికి బయటకు రాని సమయంలో 'నేను మీకు అండగా వుంటాను' అని అటవీ ప్రాంతంలోని పేద బిడ్డల వద్దకు స్వయంగా వెళ్లి వారికి నిత్యావసర వస్తువులనందించి ధైర్యం చెప్పిన ధీశాలి సీతక్క. బైక్‌పై, ఎడ్లబండిపై, ట్రాక్టర్‌పై పయనించి పేదలను స్వయంగా సందర్శించి కష్టకాలంగా ఓదార్చింది.

ఆమె ఓ సామాన్య మహిళా కార్యకర్త. ప్రతినిత్యం ప్రజల సమస్యలపై స్పందిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. తనను నమ్ముకున్న వారి కోసం ఎంత దూరమైనా వెళ్తూ గ్రామస్థాయి నుంచి మండల, జిల్లాస్థాయి నాయకురాలిగా మహిళా అధ్యక్షురాలుగా ఎంపికయ్యారు. ఇటీవల ఎన్నికల్లో జిల్లా మహిళా అధ్యక్షురాలిగా తనవంతు పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేసింది. ఎప్పటికప్పుడు కార్యకర్తల వెన్నంటే ఉంటూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అడుగుజాడల్లో నడుస్తోంది. కార్యకర్తలు, ప్రజల మన్ననలు పొందుతూ త్వరలో చిట్యాల మండలం మార్కెట్ చైర్మన్‌గా పదవి అందుకోబోతోంది. ఆమె ఎవరో కాదు... 'జయశంకర్-భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్ర శివారు కోసూరుపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ'. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నవతెలంగాణతో ముచ్చటించారు. ముందుగా మండల, జిల్లా, రాష్ట్ర మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



'సామాన్య మహిళ' సాధించిన విజయం...

నవతెలంగాణ-చిట్యాల

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ మహిళ ఏదైనా సాధించగలదని అనడానికి నిదర్శనం, కృషి, పట్టుదల ప్రజా క్షేత్రంలో నిత్యం ఉండడమేనని గుమ్మడి శ్రీదేవి అన్నారు. పట్టుదల ఉంటే దేన్నైనా సాధించొచ్చని చెప్పారు. నేటి సమాజంలో మహిళలు ధైర్యంతో ముందుండి రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. ప్రతి మహిళ ఇంటికే పరిమితం కాకుండా ప్రజల సమస్యలు, వాటి పరిష్కారాలు ముఖ్యంగా మహిళల సమస్యల పట్ల ఎప్పటికప్పటికీ స్పందిస్తూ తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారం ఉన్నా లేకున్నా తాను నమ్ముకున్న వారి కోసం తోటి వారిని గెలిపించడం కోసం పది సంవత్సరాల నుండి అహర్నిశలు శ్రమించానని తెలిపారు. మండల కేంద్ర శివారు క్రోసూరు పల్లి గ్రామం

కార్యకర్త నుండి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా...
త్వరలో చిట్యాల మండల మార్కెట్ చైర్మన్‌గా...
అందరికి ఆదర్శంగా నిలుస్తున్న 'గుమ్మడి శ్రీదేవి'



సుమారు 40 మంది కూడా లేని పల్లె నుండి చిన్న కార్యకర్తగా



మొదలై టీడీపీలో చేరి మండల, జిల్లా రాష్ట్ర నాయకురాలిగా జీవితాన్ని కొనసాగిస్తూ రాజకీయంగా గండ్ర సత్తన్న వెంట ఉంటున్నట్టు వివరించారు. గత పది సంవత్సరాలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటూ గండ్ర సతెన్న గెలుపు కోసం జిల్లావ్యాప్తంగా ప్రచార కార్యక్రమాల్లో ముందున్నానని అన్నారు.

గెలిచినా ఓడిన కంగిపోకుండా మరింత ఆత్మస్థైర్యంతో మహిళా శక్తిగా ఎదిగి అంచలంచలుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా కొనసాగుతూనే తండ్రి సత్తన్న గెలుపులో తనవంతు కృషిచేసినట్టు చెప్పారు. ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తనకు త్వరలో చిట్యాల మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు సంబంధించిన మార్కెట్ చైర్మన్ పదవి ఇస్తారని నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలాంటి పోటీ లేకుండా తనను ఎంపిక చేయడం పట్ల తన కృషి పట్టుదలేనని అన్నారు. కార్యకర్తల సమస్యల పట్ల స్పందిస్తూ అండగా ఉన్నందుకు తనకు జిల్లా మహిళా అధ్యక్షురాలుగా తర్వాత కాంగ్రెస్ పార్టీ నన్ను మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడం సంతోషకరమన్నారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునితరావు కృషి ఉందని తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని వివరించారు.



ఆమెకు ఆసరా.....మన 'సామ్రాజ్యం'

మహిళా మండలి స్థాపనతో సేవలు

నవతెలంగాణ-మంగపేట

మహిళలు బలంలో బలహీనురాలు కావచ్చు బుద్ధి కుశలతలో, మేథా సంపత్తిలో, సేవా పరాయనతలో మాత్రం వెనుకబాటు కాదు. కుటుంబంలో కూతురిగా, కోడలుగా, భార్యగా, అమ్మగా అత్తగా ఇలా బహుముఖ పాత్రలెన్నో పోషిస్తుంది. కుటుంబ పాలనతోపాటు కూలీ పనులను సైతం చేస్తున్నా నారీ మణులున్నారు. మురుగు వాడల సేవలో తరించిన మథర్ థెరీసాను, అన్నార్థుల ఆకలి తీర్చిన డొక్కా సీతమ్మను ఆదర్శంగా తీసుకుని నారీలోక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వారు ఉన్నారు. ఈ కోవలోనే తనదైన మర్గంలో పయనిస్తూ మహిళలకు ఆసరాగా ఉంటున్నారు 'కొమరగిరి సామ్రాజ్యం'.

ములుగు జిల్లాలోని మారుమూల ప్రాంతమైన మంగపేట మండలంలో 30 ఏండ్లుగా గిరిజన బాల బాలికలకు, మహిళలకు, వృద్ధులకు సేవలందిస్తున్నారు. కస్తూరి బాయి మహిళా మండలి స్థాపనలో ప్రారంభమైన కొమరగిరి సామ్రాజ్యం సేవా ప్రస్థానం... నేటి వరకు నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది. 2001లో కస్తూరి బాయి మహిళా మండలిని స్థాపించి మహిళలకు కుట్టుమిషన్లు ఇప్పించడంతో పాటు కుట్లు అల్లికలు నేర్పించి జీవనోపాధి మార్గాలు చూపించారు. 2001లో ఆర్బిసి పాఠశాల ఏర్పాటు చేసి 7 సంవత్సరాల వ్యవధిలో సుమారు 500 మంది నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించారు. కుటుంబ కలహాలతో రొడ్డుకెక్కిన సుమారు 3080 కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి విడిపోకుండా, కోర్టులకు వెళ్ళే పని లేకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపారు. పలు వివాదాలతో తనను ఆశ్రయించిన 661జంటలకు తన సొంత ఖర్చులతో వివాహాలు జరిపించారు. 12ఏండ్లుగా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ వద్ధాశ్రమంలో 35 మంది వద్దులు ఆశ్రయం పొందుతుండటం విశేషం. ఇంతటి మారుమూల అటవీ ప్రాంతంలో 1990 నుండి ఒక మహిళ పలు రంగాల్లో తన సేవలు అందించడం విశేషం.

ప్రముఖుల సత్కారాలు.. ప్రశంసలు..

సామ్రాజ్యం సేవలు గుర్తించిన ఆనాటి అధికారులు, కలెక్టర్లు ఆమెను జ్ఞాపికలు, శాలువాలు, ప్రశంసా పాత్రలతో సత్కరించారు. 2023లో హైదరాబాద్‌కు చెందిన మంజునాథ ఫౌండేషన్ వారు సామ్రాజ్యం సేవలు గుర్తించి ప్రతిభ పురస్కారంతో పాటు, నంది అవార్డును బహూకరించారు. మారుమూల అటవీ ప్రాంతంలో ఉంటున్న సామ్రాజ్యం మహిళల అభ్యున్నతికి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసి ఎందరికో ఆదర్శప్రాయురాలిగా నిలిచారనడంలో ఎలాంటి సందేహం లేదు.



మహిళలు అన్ని రంగాల్లో

స్వయం సమృద్ధి సాధించాలి



ముదిరాజ్ మహిళా నాయకురాలు

బడే పుష్పలత

నవతెలంగాణ -కోల్‌బెల్ట్

మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమద్ధి సాధించాలని, మగవారితో ఏ మాత్రం తీసిపోకుండా గట్టి పోటీ ఇవ్వాలని జయశంకర్ భూపాలపల్లి ముదిరాజ్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బడే పుష్పలత కోరారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె నవతెలంగాణతో తన ప్రయాణాన్ని వివరించారు. తన జీవిత ప్రయాణంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ టీచర్‌గా, సింగరేణి సేవా సమితి సెక్రటరీగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ లో ఒక గైడ్‌గా, ఒక బిజినెస్ వుమెన్‌గా, సమాజం పట్ల బాధ్యత ఉన్న సామాజిక కార్యకర్తగా, ఒక గహిణిగా అనేక పాత్రను పోషిస్తూ రాణిస్తున్నారు పుష్పలత.

మొదటిగా తన ప్రస్థానం గహిణిగా ఇంటిని చక్కదిద్దుతూనే ఒక ప్రైవేట్ పాఠశాలలో 12 సంవత్సరాలు ఉపాధ్యాయ వత్తిలో కొనసాగారు. సింగరేణి స్కౌట్స్ అండ్ గైడ్స్ లో సుదీర్ఘ సేవలందిస్తూ గత రెండు సంవత్సరాల క్రితం వరకు సేవలందిస్తూ బేసిక్ గైడ్ కెప్టెన్ దశ వరకు చేరుకున్నారు. మార్కెటింగ్ రంగంలో రాణించాలనే సంకల్పంతో క్యాండిల్స్ తయారీ, ఫ్లవర్ బొకేల తయారీ రంగాన్ని ఎంచుకుని మార్కెటింగ్ లో కూడా తనదైన ముద్ర వేశారు. సింగరేణి సేవా సమితి సెక్రటరీగా సుదీర్ఘంగా దశాబ్ద కాలం పాటు కొనసాగి, చురుకుగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అందరితో కలిసి మెలిసి ఉంటూ, సింగరేణి మహిళలను చైతన్య పరుస్తూ సింగరేణి వ్యాప్తంగా ఉత్తమ మహిళగా అవార్డు కూడా గెలుచుకున్నారు. 2023లో ముదిరాజ్ కుల సంఘంలో మహిళా విభాగానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు అధ్యక్షరాలుగా ఎన్నికై తన కులంలో ఉన్న మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నారు. ఒక సామాజిక కార్యకర్తగా సమాజం, సాటి మహిళల పట్ల తనకున్న బాధ్యతతో జిల్లా కేంద్రంలోని తన నివాస పరిధిలోని మహిళలను సంఘటితం చేసి వారికి ఆర్థిక స్వావలంబన కోసం వారిచే పిండి వంటలు, స్వీట్స్, పూజా వత్తులు, దీపాలు, పూలదండల తయారీ చేయిస్తూ... కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తూ వారి ఆర్థిక ప్రగతికి పాటుపడుతున్నారు. నేటి పోటీ ప్రపంచంలో మహిళలు మగ వారితో పోటీపడుతూ అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు పట్ల జరుగుతున్న దాడులు, మోసాల పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రక్షణ కొరకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తేవడమే కాకుండా, పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగాలి

బీఆర్ఎస్ మహిళా విభాగం
ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన
కార్యదర్శి భూక్య సుమలత

నవతెలంగాణ-గోవిందరావుపేట



మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలు ఐక్యంగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ మహిళా విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సుమలత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం సుమలత నవతెలంగాణతో మాట్లాడారు. చట్ట సభలతో సహా అన్ని రంగాలలో ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ప్రభుత్వాలు వెనుకబడి ఉన్నాయని అన్నారు. చట్ట సభలతో సహా అన్ని రంగాల్లో మహిళలకు సమాన హోదా హక్కులు కల్పించాలని, వాటి పరిరక్షణకు మహిళలు ఉద్య మించాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణకు కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో రాణించేందుకు ప్రయత్నం చేయాలని అన్నారు.

పోటీపడి దీటుగా ఎదగాలి : జీపీ కార్యాదర్శి భారతి

నవతెలంగాణ-గోవిందరావుపేట



నేటి పోటీ ప్రపంచంలో ప్రతి రంగంలోనూ మహిళలు పోటీగా దీటుగా ఎదిగి రాణించాలని చల్వాయి గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ భారతి అన్నారు. గురు వారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరిం చుకొని నవతెలంగాణతో భారతి మాట్లాడారు. తల్లిదండ్రులు ఒకప్పటికి ఇప్పటికీ కొంత మార్పు వచ్చిందని ఆడపిల్లలను గతంలో చదివించే వారు కాదని మరికొందరు మగ పిల్లలను కార్పోరేట్ పాఠశా లల్లోనూ ఆడపిల్లలను సాధారణ పాఠశాలల్లో చదివించే వారన్నారు. విద్యారంగంలో ఇప్పుడు న్న అన్ని పలితాలలో విద్యార్థులు ప్రథమ స్థానం లో వస్తున్నారని అన్నారు. లింగ బేధం లేకుండా ఇద్దరినీ సమానంగా చూసుకుంటున్న పరిస్థితులు ఇప్పు డిప్పుడే చోటు చేసుకుంటున్నాయి. సమాజం ఆడ మగ ఇద్దరినీ సమానంగా చూసి నప్పుడే సమ సమాజం ఏర్పడుతుందని అన్నా రు. ప్రభుత్వాలు కూడా మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని కొన్ని వ్యవస్థలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని అన్నారు. వాస్తవికతకు దూరంగా ఉన్నాయని, మహిళలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు సంక్రమించే విధంగా ఉండాలని అన్నారు. మహిళల రక్షణ కోసం మరింత బలమైన చట్టాలను రూపొందించి అమలుపరిచే విధంగా చూడాలన్నారు. తద్వారా మహిళల పట్ల జరుగుతున్న పలు నేరాలను అరికట్టవచ్చని అన్నారు. ముందు ముందు ప్రపంచం లో మహిళలు అగ్ర భాగాన ఉండడం ఖాయమని ఆ దిశగా మహిళా లోకం ఆలోచించి హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అన్నారు.



మానవ సమాజానికి మూలం 'మహిళా'


ఐసీడీఎస్ సూపర్వైజర్ కవితా రెడ్డి

నవతెలంగాణ-పెద్దవంగర

మానవ సమాజానికి మూలం మహిళ అని, మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని, మహిళ అంటే అబల కాదు, సబల అని ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె **'నవతెలంగాణ'**తో మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం జరుగుతుంది. మహిళలు లేనిది సమాజం లేదు. అయితే మహిళలపై దాడులు, అఘాయిత్యాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. కావున మహిళల రక్షణ కోసం అమలు చేస్తున్న నిర్భయ, దిశ, ఫోక్సో, షీ టీమ్స్ లాంటి చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. మహిళలకు కుటుంబం పట్ల పురుషుల కంటే ఎక్కువ బాధ్యత ఉంటుంది. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తులను కఠినంగా శిక్షించాలి. 2024లోకి అడుగుపెట్టాం. అంతర్జాతీయ దినోత్సవం ప్రారంభమై 112 ఏళ్లుగడిచినా మహిళా సాధికారత కాగితాలకే పరిమి తమైంది. మహిళలు కోరుకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలు అన్నింట అసమానత కొనసా గుతూనే ఉంది. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో 545 మంది సభ్యులు ఉన్న పార్లమెంటులో కేవలం 12 శాతం మహిళల స్థానం. సమస్యలు దాటి మహిళలు అభివృద్ధి చెందాలంటే ఈ వ్యవస్థని ప్రక్షాళన చేయాలి. మహిళలు చైతన్య వంతులు అయినప్పుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.





































మహిళా హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు

పోరాట స్ఫూర్తిని నేర్పిన మహిళా దినోత్సవం ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీలు

నవతెలంగాణ-వరంగల్

సమాజం పురోగతికి మహిళల పాత్ర కీలకం. మహిళలు లేకుంటే సమాజం లేదు.మహిళలలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళలు వారి చేసే పనికి సమాన పనికి, సమాన వేతనం, ఓటు హక్కు తదితర డిమాండ్లతో పోరాటం చేశారు. దానికి గుర్తుగానే మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడింది. కానీ అలాంటి ఘటనలు సాధారణ విషయాలుగానే మిగిలిపోతున్నాయి. ఉద్యమాల చరిత్రను మరుగున పడేసి వేడుకలను నిర్వహిస్తూ మార్కెట్ ప్రేరేపిత ప్రాజెక్టులుగా మారుస్తున్నారు. మహిళల హక్కులపై ఐక్య పోరాటాలకు ఐద్వా పిలుపునిచ్చింది.

ఒక వైపు ఆధునిక టెక్నాలజీ అభివద్ధి చెందుతున్నప్పటికీ విష సంస్కతి మానవుల్లో విపరీతంగా పెరిగిపోతుంది. ఆర్థిక సామాజిక హక్కులు, భద్రత కోసం మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టాలని, మద్యాన్ని నియంత్రించాలని, బడ్జెట్లో మహిళా సాధికారత కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని నిరంతరం పోరాటాలను చేస్తున్నప్పటికీ పరిష్కారం దిశగా ముందుకు పోవటం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత పట్ల గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ మహిళలపై జుగుప్సాకరమైన దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. సభ్యసమాజం తలదించుకునేలా లైంగిక దాడులు మానవత్వాన్ని మగ్యం చేస్తుంది.


మహిళల కోసం పోరాటాలు చేసిన ఫలితంగా రాజ్యాంగం స్త్రీలకు కొన్ని హక్కులను కల్పించింది. కానీ విద్యా విభాగాల్లో 33శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థలలో 50శాతం స్థానిక సంస్థల్లో, ఆస్తిలో వాటా, శ్రామిక మహిళలకు కనీస వేతన చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ చట్టం వంటిది అయితే వీటిలో కొన్ని కాగితాగిలకే పరిమితవుతున్నాయి. మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రభుత్వాలు మహిళా భద్రతపై షీ టీమ్స్ శ్రేష్ఠం అని చెప్పు కుంటున్న ప్పటికీ ఆచరణలో మాత్రం సి బ్బంది తక్కువగా ఉండ డం వలన షీ టీమ్స్ సేవలు అందడంలో కొంత ఆల స్యం జరుగుతుందని పలు వురు పేర్కొంటు న్నారు. షీ టీమ్స్ సిబ్బందిని పెంచి మహిళలకు రక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది.

పోరాట స్ఫూర్తి నేర్పిన మహిళా దినోత్సవం : నలిగంటి రత్నమాల (ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి)


పెట్టుబడి దారి, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంతో 8గంటల పనిదినం, కనీస వేతనమివ్వాలని, మహిళ లకు ఓటు హక్కు కల్పించాలని అనేక పోరాటాలు చేసినప్పటికీ అందులో కొన్ని మాత్రమే మహిళలకు చెందుతున్నాయి. పోరాట స్ఫూర్తి నేర్పిన మహిళా దినోత్సవాన్ని మహిళల హకుకలకు సంకేతంగా మార్చి 8న ఘనంగా మహిళలు జరుపు కుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం మహిళా సాదికారతను సాధిస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్నటికీ నేటికీ ఆచరణకు నోచుకోవడం లేదు. భేటీ బచావో బేటీ పడావో పథకంపై మోడీ సర్కార్ మరోసారి నిర్లక్ష్యం చూపించింది. మహిళా దినోత్సవం స్ఫూర్తితో బడ్జెట్ అధిక నిధులు కేటాయించాలి.
































అందరూ అడపిల్లలే... ఉద్యోగస్తులే...

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్



పాలకుర్తి మండలంలోని తిరుమలగిరి చిన్న పల్లెటూరు. కౌడగాని సోమయ్య, కమలమ్మ దంపతులు ఒక సాధారణ రైతు కుటుంబం. నలుగురు ఆడపిల్లలు అయినను నిరాశ చెందక పట్టుదలతో పిల్లలను ఉన్నత చదువులు చదివించి పెళ్లిళ్ల చేశారు. నలుగురు ఆడపిల్లలైనను నిరుత్సాహపడలేదు తల్లి కమలమ్మ. నాకు నలుగురు ఆడపిల్లలైనను కొడుకులు లేరన్న నిరాశ ఏనాడు చెందలేదు. ఉన్న ఆస్తిలో కొంత భాగం అమ్మి పిల్లలకు ఉన్నత చదువులు చదివించా. వీరంతా ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉద్యోగం చేస్తున్నారు. ఉన్నంతలో కట్న కానుకలు ఇచ్చి పిల్లలందరికీ పెళ్లిళ్ల చేసినాము. వివరాలు కె. మమత, అసిస్టెంట్ ప్రొఫెసర్, భారత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హైదరాబాద్, కె. ఉమారాణి, ఎం.ఏ, బి.ఈడి., టీచర్, టిడబ్ల్యూ ఆర్ఎస్, సిద్దిపేట, కె. అనిత, ఎమ్ఎస్సీ, బీఈడీ, బోటని, లెక్చరర్, మేఘన జూనియర్ కాలేజ్, రామంతపూర్, కె.రజిత, బి.టెక్, మెకానికల్ ఇంజనీరింగ్, సాఫ్ట్ వేర్ ఇంజనీర్, ఓపెన్ టెక్స్ కంపనీ, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

ఆలయ ఉత్సవ కమిటీలో లక్ష్మన్నకు చోటు

నవతెలంగాణ-పాలకుర్తి



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 8 నుండి 11 వరకు జరిగే శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల విజయవంతానికి ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలో ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి లక్ష్మన్నకు చోటు కల్పించారు. ఉత్సవ కమిటీలో లక్ష్మన్న పేరు లేకపోవడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు లక్ష్మన్నకు చోటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. దర్శనానికి వచ్చే భక్తులు సహకరించాలని కోరారు.

సమాజంలో మహిళలు గౌరవంగా జీవించాలి

జాతరలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు - ఆర్డబ్ల్యూఎస్ డీఈ సంధ్య

నవతెలంగాణ-పాలకుర్తి



సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా గౌరవంగా జీవించాలని ఆర్డబ్ల్యూఎస్ డీఈ సంధ్య కోరారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ సమాజంలో మహిళలు సగభాగం ఉన్నారని తెలిపారు. స్వయం కృషితో మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదిగారని గుర్తు చేశారు. రాణి రుద్రమ దేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, చాకలి ఐలమ్మలను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అమ్మాయిలను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు చేయూతనివ్వాలని, శాస్త్రవేత్తలుగా ఎదిగినప్పుడే మహిళ సమాజానికి సార్ధకత ఉంటుందని తెలిపారు. ఈ నెల 8 నుండి 11 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టామన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా నాలుగు త్రాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాతల సహకారంతో నీటి బాటిల్లు అందిస్తామని, ఆర్చిగేటుతో పాటు మెట్ల వద్ద, మండపం వద్ద, ఘాట్ రోడ్డు వద్ద, త్రాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలు నీటిని వృధా చేయరాదని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పంపుసెట్లతోపాటు మిషన్ భగీరథ నీటిని భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఘాట్ రోడ్డు మార్గాన వెళ్లే భక్తులకు అడుగడుగునా త్రాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండే విధంగా నల్లాలను ఏర్పాటు చేశామన్నారు.

సమాజానికి మహిళలు ఆదర్శం

ఏడు ఆలయాలకు, ఏడు మండలాలకు ఒక్కరే ఇన్చార్జ్

విధుల్లో ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న

నవతెలంగాణ-పాలకుర్తి



సమాజానికి మహిళలు ఆదర్శంగా నిలుస్తారన్న పదానికి అధికారిని స్ఫూర్తిగా నిలిచింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈవోగా పని చేస్తున్న లక్ష్మి ప్రసన్న ఏడు ఆలయాలకు ఇన్చార్జి ఈవోగా, ఏడు మండలాలకు ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగుచున్నానని లక్ష్మీ ప్రసన్న తెలిపారు. పాలకుర్తి ఆలయంతో పాటు చిల్పూరు, ఇప్పగూడెం, నవాబుపేట, వల్మీడీ, చిన్న పెండ్యాల, జనగామ ఆలయాలకు ఇన్చార్జి ఈవోగా, పాలకుర్తి, లింగాల గణపురం, కొడకండ్ల, స్టేషన్‌ఘన్పూర్, చిల్పూర్, జఫర్గడ్, దేవరపుల మండలాలకు ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానని తెలిపారు. సమాజంలో పురుషులతో సమానంగా పోటీపడి మహిళా శక్తిని చాటాలని మహిళలను సూచించారు. మహిళ లేనిదే సమాజం లేదని, అందుకు స్ఫూర్తిగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకు పోవాలని అన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సోమేశ్వరాలయం

నేడు స్వామి వారి కళ్యాణం - హాజరుకానున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పాలకుర్తి



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 8 నుండి 11 వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8న శుక్రవారం రాత్రి 8 గంటలకు శ్రీ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం, 9న శనివారం రథోత్సవం బండ్ల తిరుగుట, 10న ఆదివారం డోలారోహణం, 11న సోమవారం అగ్ని గుండములు మహాఅన్నపూజ పండిత సన్మానం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఈనెల 8 నేటి నుండి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి 8 గంటలకు స్వామివారాల కళ్యాణం వేద పండితులచే అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ కాంతులతో అలంకరించారు. స్వామివారాల కళ్యాణంలో పాల్గొనే భక్తులు 2016లో చెల్లించి రసీదు పొందాలని ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న కోరారు. శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఇతర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి భక్తులు తరలి వస్తారని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 8న ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.బ్రహ్మోత్సవాలసందర్భంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో సోమన్న ఆలయ జాతరకు భక్తులు వేలాదిగా తరలి రావడంతో భక్తులకు అందుబాటులో ఉండే విధంగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాల్లో మత్తు పానీయాలు పదార్థాలు విక్రయించకుండా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తామని ఎక్సైజ్ శాఖ సిఐ సంతోష్ రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే వైద్య శిబిరంలో పాల్గొనే మహిళ వైద్య సిబ్బందికి రూములు కేటాయించకపోవడం విశేషం.

బ్రహ్మోత్సవాలకు హాజరుకానున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా 8న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డితో పాటు కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు హాజరవుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని పాలకుర్తి ఎస్సై మోడం సాయి ప్రసన్న కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్టేషన్‌ఘన్పూర్ ఆర్డీవో డిఎస్ వెంకన్న, పాలకుర్తి తహసిల్దార్ తీరందాస్ వెంకటేశంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతంలో పరిశుభ్రతను పాటించేందుకు గ్రామపంచాయతీ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

సోమేశ్వరునికి అర్చకుల కొరత

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకుల కొరత ఏర్పడింది. దినదినాభివృద్ధి చెందుతున్న ఆలయానికి సరిపడా అర్చకులు లేకపోవడంతో అందుబాటులో ఉన్న అర్చకులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2000 సంవత్సరంలో ఆలయానికి రెండున్నర లక్షల ఆదాయం ఉన్నప్పుడు ఆరుగురు అర్చకులు ఉండేవారని, ఆలయం అభివృద్ధిలో భాగంగా 2023 సంవత్సరంలో మూడు కోట్ల 50 లక్షల ఆదాయం ఉన్నప్పటికీ నలుగురు అర్చకులు విధుల్లో ఉన్నారని అర్చకులు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిమంది భక్తులు తరలి వస్తారని ఆలయానికి సుమారు 8 మంది అర్చకులు ఉండాల్సి ఉండగా నలుగురు ఉండటం వల్ల మిగతా అర్చకులను నామమాత్రంగా అద్దెకు తీసుకువచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. నిత్య పూజలు జరిగే ఆలయంలో అర్చకుల కొరత లేకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టి సత్వర చర్యలు చేపట్టాలని అర్చకులు ఆలయ సిబ్బంది కోరుచున్నారు.

మహిళ చైతన్యమే అభివృద్ధికి దోహదం

నవతెలంగాణ-పాలకుర్తి

మహిళలు ఆర్థిక స్వలంబనను సాధించాలి
రాజకీయ రంగాల్లో మహిళలు రాణించాలి
మహిళ సంక్షేమానికే కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



అన్ని రంగాల్లో మహిళలు చైతన్యవంతులైనప్పుడే అభివృద్ధికి బాటలు వేస్తారని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ విద్య వైద్య వ్యాపార రంగాలతో పాటు రాజకీయ ఆర్థిక రంగాల్లో రాణించినప్పుడే మహిళ స్వాలంబనకు సార్థకత ఉంటుందన్నారు. సమాజంలో మహిళలు సగభాగం ఉన్నారని, స్వశక్తితో ఎదిగినప్పుడే మహిళలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. వ్యాపారవేత్తలుగా శాస్త్రవేత్తలుగా సమాజానికి సేవలందించాలన్నారు. దేశాన్ని పరిపాలించిన శక్తి సామర్థ్యాలు మహిళలకు ఉన్నాయని, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళా సమాజానికి ఆదర్శంగా నిలిచి దేశాన్ని పరిపాలించింది అన్నారు. చట్టసభల్లో మహిళలు రాణించినప్పుడే 50 శాతం రిజర్వేషన్ అమలుకు నోచుకుంటుందన్నారు. చట్టసభల్లో అడుగు పెట్టానంటే మహిళల సహకారంతోనేనని తెలిపారు. మహిళా చైతన్య ముందు ఏ శక్తి అడ్డు రాదని, అందుకు నిదర్శనం పాలకుర్తి నియోజకవర్గంలో 2023 నవంబర్ 30 అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనం అని తెలిపారు. సమాజంలో మహిళలను అభివృద్ధి చేస్తూ మరింత గుర్తింపును తీసుకువచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేశామని నాలుగింటిలో మూడు మహిళల వేనని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం, గృహలక్ష్మి, గృహజ్యోతి, సబ్సిడీ వంటగ్యాస్ పథకాలు మహిళ సంక్షేమానికి బాటలు వేస్తాయని తెలిపారు. మహిళలు చైతన్యవంతులై రాజకీయ రంగాలతో పాటు ఆర్థిక వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ మహిళలందరికీ ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

'ఆమె'కు ప్రోత్సాహాన్ని అందిస్తేనే మార్చి 8కి సార్ధకత

నవతెలంగాణ-పెద్దవంగర



మహిళలకు ప్రాధాన్యతను ఇచ్చి, ప్రోత్సాహాన్ని అందిస్తేనే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి నిజమైన స్వార్థకత ఉంటుందని బీజేపీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి, వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు సాయిని ఝాన్సీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'నవతెలంగాణ' తో మాట్లాడారు. మహిళా దినోత్సవం అంటే కేవలం ఈ ఒక్కరోజు మాత్రమే మహిళలను గౌరవించడం కాదు. మగువ విలువను గుర్తిస్తూ, ప్రతిరోజు స్త్రీని గౌరవించినప్పుడే సమాజం బాగుపడుతుంది. అవని నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో ఆడవాళ్లు పురుషుడితో సమానంగా రాణిస్తుండడంతో పాటుగా, మహిళలు సమాజంలో మరింత మేటిగా నిలుస్తున్నారు. మహిళల సమానత్వం అందరికీ బాధ్యతగా సమాజం గుర్తించి, మనిషిగా చూసే దృక్పథం అలవర్చుకోవాలి. వివక్షపై ఇంట బయట ప్రశ్నించే తత్వం పెరగాలి. ఆయా వ్యవస్థలు, ప్రభుత్వాలు ఆమెకు తగిన ప్రోత్సాహం అందించాలి. అప్పుడే మార్చి8కి నిజమైన స్వార్థకత ఉంటుంది. మహిళా మణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

ధైర్యంగా ముందుకు సాగాలి

తొర్రూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ హైమవతి

నవతెలంగాణ-పెద్దవంగర

మహిళలు పురుషుల కంటే ఎక్కడా తక్కువ కాదన్న మనోధైర్యంతో ముందుకు సాగాలి. అమ్మాయిల చదువు విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయవద్దు. అమ్మాయి విద్యావంతురాలైతే.. భవిష్యత్తు తరాలకు భవితనిస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు.



అక్కడ బొమ్మలే పాఠ్యాంశాల బోధకులు

- ఉపాధ్యాయ వృత్తిఖ్యాతిని పెంచుతున్న తిరునగరి పద్మ
- కృత్యాధార పద్ధతులతో పాఠాల బోధన
- పలు పురస్కారాలు ఆమె సొంతం



నవతెలంగాణ-శాయంపేట

ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందంటే విధులకు హాజరయ్యామా, విధులు ముగిసాక వెళ్లిపోయామా అనుకునే ఉ ద్యోగులకు భిన్నంగా తీసుకుంటున్న గౌరవ వేతనానికి తగిన న్యాయం చేయాలని అంకితభావంతో పనిచేస్తూ, పనిచేస్తున్న పాఠశాలను, తోటి ఉద్యో గులతో కలిసి అందంగా తీర్చిదిద్దుతూ గోడలపై వాటర్ పెయింటింగ్‌తో పాఠ్యాంశాల బొమ్మలను చిత్రీ కరించడంతో ఆ బొమ్మలే విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తు న్నాయి. విద్యార్థులకు పాఠాలను చదివి చెప్పడమేకాకుండా కృత్యాధార బోధన ద్వారా విద్యార్థుల మనస్సుకు హత్తుకునేలా పాఠాలు బోధిస్తూ తనదైన శైలిలోరాణిస్తు అందరి ఆదరాభిమానాలు చురగొంటున్నారు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తిరునగరి పద్మ. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వృత్తి ఉపాధ్యాయురాలుగా, ప్రవృత్తి కవయిత్రిగా రాణిస్తున్న పద్మపై **'నవ తెలంగాణ'** అందిస్తున్న ప్రత్యేక కథనం...

పరకాల మండలంలోని పోచారం గ్రామానికి చెందిన తిరునగరి శేషయ్య పుష్పలత దంపతుల రెండవ కుమార్తె పద్మ. ఈమెను హన్మకొండ పట్టణంలోని పంచాయతీరాజ్ శాఖ డిఎం గా పనిచేస్తున్న లంక రఘుతో 1994 లో వివాహం జరిగింది. పద్మ చదువులో ప్రతిభ కనబ రుస్తుండడంతో డబుల్ పీజీ, బీఈడీ, ఎంఈడి పూర్తి చేయించారు. 2009లో జనగామ జిల్లా దేవరుప్పుల మండలం రామరాజు పల్లి ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా నియమితులయ్యారు. వృత్తి ఉపాధ్యాయురాలుగా ఉన్నప్పటికీ ప్రవృత్తి సాహితీవేత్తగా రాణిస్తున్నారు. పద్మ 10వ తరగతి ములుగులో ఇప్పటి మంత్రి సీతక్క క్లాస్‌మేట్. 1988లో చదువుకునే రోజుల్లో డ్రాయింగ్ మాస్టర్ రామాచారి స్ఫూర్తితో డ్రాయింగ్ నేర్చుకున్నారు. పెయింటింగ్‌లో పద్మ మక్కువ చూపుతూ విద్యార్థులకు ఫ్యాబ్రిక్స్ పెయింటింగ్, డ్రాయింగ్ నేర్పించారు. 2018లో జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ పిఎస్‌లో పనిచేస్తూ తనసొంత ఖర్చులతో పాఠశాల గోడల పైన పాఠ్యాంశాలను తోటి ఉపాధ్యాయుల, విద్యార్థుల సహాయంతో 65 బొమ్మలను వేశారు. 37 జీవోబదిలీలో భాగంగా 2022లో భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి పిఎస్ కు బదిలీపై వచ్చారు. ఇక్కడి పాఠశాల గోడలపై తరగతి గదులలో ఎంతో ఆకర్షణీయమైన చిత్రాలను వేశారు. రైలు బోగి పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కృత్యాధార పద్ధతులతో పాఠాల బోధన ...

తెలుగు పాఠ్యాంశాలను చదివి చెపితే విద్యార్థులకు అర్థం కాదనే భావనతో, మూస ధోరణికి స్వస్తి చెప్తూ పాఠ్యాంశాలలోని పాత్రలను నాటకీకరణ పద్ధతిలో, విద్యార్థులకు వేషాధారణ వేస్తూ కత్యాదార పద్ధతిలో కళ్లకు కట్టినట్టుగా పాఠాలు బోధిస్తూ తనదైన శైలిలో రాణిస్తున్నారు. కుల వృత్తులు, పల్లెఅందాలు, గ్రామీణక్రీడలు లాంటి ఎన్నో పాఠ్యాంశాలను కత్యాదార పద్ధతుల ద్వారా బోధన చేస్తూ విద్యార్థుల హదయాలను హత్తుకునేలా చేశారు. ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తూనే, మరో పక్క కవయిత్రిగా ఎన్నో అద్భుతమైన కవితలను రాశారు. మహిళలు ఏ వృత్తిలోనైనా రాణించాలంటే కృషి, పట్టుదల తప్పకుండా ఉండాలని, చేసే వత్తిలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చిన, ఎదుర్కొని గుండె ధైర్యంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పద్మ తెలిపారు.

పలు అవార్డులు సొంతం ....

2017లో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వారిచే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్నారు. భద్రాచలంలో అవార్డ్స్ టీచర్ అసోసియేషన్, తానా అధ్యక్షులు డెక్కంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా జెడి లక్ష్మీనారాయణ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. జాతీయస్థాయి అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు, ఉగాది పురస్కారం కలెక్టర్ దేవసేన చేతుల మీదుగా, నిజామాబాదులో నేషనల్ లెవెల్ బెస్ట్ టీచర్ అవార్డు, పాలకుర్తిలో ప్రపంచ తెలుగు మహాసభల కలెక్టర్ దేవసేన, ఎమ్మెల్సీ చుక్కా రామయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2023 భూపాలపల్లి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యా యురాలు అవార్డు అందుకున్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చేతులమీదుగా అవార్డుఅందుకున్నారు. హనుమకొండ లయన్స్ క్లబ్ లో ఇంటర్నేషనల్ బెస్ట్‌టీచర్ అవార్డు అందుకున్నారు. మండల, జిల్లాస్థాయిలో అనేక ఉత్తమ ఉపా ధ్యాయుల అవార్డులు, రచయిత్రిగా అవార్డులను అందుకొని మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



నాటి త్రిపుటాలయం ... నేటి శ్రీ ముఖ్యనాథ దేవాలయం





నవతెలంగాణ-ధర్మసాగర్

కాకతీయ రాజు గణపతి దేవులు 11వ శతాబ్దంలో ధర్మసాగర్ మండలంలోని ముప్పారంలో ప్రకృతి ఒడిలో నిర్మించి శివుడు ప్రధాన దేవుడుగా ప్రతిష్టించిన త్రికూటలయం అతి ప్రాచీనమైన శ్రీముఖ్యనాథస్వామి దేవాలయంగా ప్రసిద్ధికెక్కింది. కాకతీయుల సామ్రాజ్యంలో అంగరంగా వైభవోపేతంగా పూజలతో దేదీప్యమానంగా వెలిగిన దేవాలయం వారి కాలాంతరం దాడికి గురైై కొన్ని వందల యేండ్లుగా పూజలు లేక శిథిలావస్థకు చేరింది. గత మూడేళ్ల క్రితం మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన శివసాని ప్రవీణ్‌రవీంద్ర అనే భక్తునికి తెల్లవారుజామున శివుడు కలలోకి వచ్చి ముఖ్యనాథ స్వామి ఆలయంలో తిరిగి పూజలు జరిగే విధంగా చూడాలని చెప్పడం జరుగుతుంది. ఈ క్రమంలో వారి నేపథ్యంలో 2021 అక్టోబర్ 4న మాస శివరాత్రిన మొదటగా కొందరు భక్తులను తీసుకెళ్ళి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుండి గ్రామస్తులు కొద్దికొద్దిగా ఆలయంకు రావడం మొదలుపెట్టారు. అనంతరం కార్తీక మాసంలో పురాతనమైన విఘ్నేశ్వర స్వామి విగ్రహం భక్తులకు దర్శనమివ్వడంతో స్వామి వారిని ఆలయంలో ఉంచి పూజలు మరింతగా చేయడం ప్రారంభించారు. శ్రీ ముఖ్యనాథస్వామి ఆలయంలో శివరాత్రి 2022 ముందురోజు (సోమవారం) పుట్టను తవ్వుతుండగా పుట్టలో మహాశివలింగం దర్శనం ఇవ్వడంతో భక్త కోటి జనం స్వామివారిని దర్శనం చేసుకున్నారు. నాటి నుండి శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయం అభివృద్ధి వైపు అడుగులు వేసింది. దాతల సహకారంతో దేవాలయం కమిటీ చైర్మన్ శివసాని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆలయానికి శాశ్వత విద్యుత్ లైన్ నిర్మాణం చేశారు. ఒక్కొక్కటిగా అన్ని మౌళిక వసతులు సమకూరడంలో 2023 నవంబర్ 19న ఆలయం పునఃప్రాణ ప్రతిష్ట కా ర్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి ఆలయ పునఃనిర్మాణ వ్యవస్థాపకులు, చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర కొనసాగుతూ ఆలయ అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి : వేలేరు ఎస్సై డి.హరిత

నవతెలంగాణ-వేలేరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకుంటారు. అంతర్జాతీయంగా మహిళలు తమ హక్కులను గుర్తించి మహిళా సమానత్వం, సాధికారత, సామాజిక మార్పుపై అవగాహనతోపాటు వీటి సాధనకోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకునే రోజు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగసంస్థలు, పలు సామాజిక సంస్థలు వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించి, వారిని గౌరవించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటా, బైటా మహిళలు ఎదుర్కొనే సమస్యలు, మహిళల పునరుత్పత్తి హక్కులు, మహిళలపై లైంగిక దోపిడీ లాంటి అనేక ఇతర సమస్యలు చర్చకు వస్తాయి. ఈ సందర్భంగా స్టేషన్ హౌస్‌ఆఫీస ర్‌గా వృత్తిపట్ల నిబద్ధతో తన మార్క్‌ను ప్రదర్శి స్తున్న మహిళ, వేలేరు ఎస్సై డి.హరితతో ప్రత్యే క ఇంటర్వ్యూ.

నవతెలంగాణ : నమస్కారం మేడం. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

ఎస్సై : నమస్కారమండి, థాంక్యూ.

నవతెలంగాణ : మీ క్వాలిఫికేషన్ ఉద్యోగ ప్రస్థానం గురించి వివరిస్తారా ?

ఎస్సై : బీటెక్ ఈసీఈ 2015లో ఫైనల్ ఇయర్ చదువుతుండగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లభించింది. ఆ ఉద్యోగం చేస్తున్న క్రమంలో మా కుటుంబం, బంధువులలో అందరూ సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన ఉద్యోగులే గవర్నమెంట్ ఉద్యోగులు లేరు. ఎలాగైనా గవర్నమెంట్ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్ లోని ఆర్‌సీరెడ్డి కోచింగ్ సెంటర్‌లో గ్రూప్-2 శిక్షణకు చేరాను. మొదటగా ఎస్‌ఐ నోటిఫికేషన్ 2016లో రావడంతో పరీక్షకు హాజరు కావడం జరిగింది.

తర్వాత గ్రూప్-2 పరీక్ష కూడా రాశా ను. మొదటగా ఎస్సై పరీక్ష ఫలితాలు రావడం చేత ఎస్సైగా ఎంపికై ఉద్యోగంలో చేరాను. గ్రూ ప్-2 పరీక్షలు కోర్టు కేసుపడడం వల్ల ఫలితాలు ఆలస్యమై ఆ ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఉద్యోగం వచ్చినప్పటికీ ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో చేరేడం ఇష్టంలేక ఇదే ఉద్యోగాన్ని కొనసాగించాను. మొదటగా ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్లో ప్రొహిబిషన్ పీరియడ్ తరువాత ఎస్‌హెచ్‌ఓగా తరిగొప్పుల, సంగెం, మహిళా పోలీస్ స్టేషన్ వరంగల్లో విధులు నిర్వహించి వేలేరు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై రావడం జరిగింది.



నవతెలంగాణ : వేలేరు పోలీస్‌స్టేషన్‌లో మహిళల పట్ల ఎలాంటి కేసులు వస్తున్నాయి? వాటి పరిష్కారానికి మీరు చేస్తున్న కృషి ?

ఎస్సై : వేలేరు పోలీస్‌స్టేషన్‌లో గృహహింస కేసులు వస్తున్నాయి అన్ని కేసులను కౌన్సెలింగ్ నిర్వహించి పరిష్కారం చేశాము.

నవతెలంగాణ : గృహహింస కేసులపై ప్రజలకు మీరు ఇచ్చే సూచన ?

ఎస్సై : కుటుంబంలో చిన్న చిన్న గొడవలను భార్యాభర్తలు పెద్దవి చేసుకోవద్దని అటువంటివి సహజమని ఓపికతో పరిష్కార మార్గాలు వెతుక్కోవాలన్నారు. ఆవేశానికి అసహనానికి గురికాకూడదని ప్రేమతో అన్నింటిని గెలవవచ్చని కౌన్సిలింగ్ ఇచ్చి పరిష్కారానికి కృషి చేశాను. అవి ఫలించాయి. ఇంట్లో పరిష్కారం కానిపక్షంలో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించవచ్చు. పోలీసు వారు మీకు అండగా ఉంటారు.

నవతెలంగాణ : ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవాన్ని ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు. 2024 అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉద్దేశ్యం ఏమిటి?

ఎస్సై : లింగ సమానత్వం, సమాజంలో మహిళలపాత్ర, మహిళలపై వేధింపులు, మహిళలకు సమాన హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రకటించడంలోని ఉద్దేశం. ప్రతిసంవత్సరం మహిళా దినోత్సవాన్ని ప్రత్యేకథీమ్‌తో జరుపుకుంటారు. 2024 ఏడాదికి సంబంధించి ' ఇన్‌స్పైర్ ఇన్‌క్లూజన్' అని థీమ్‌తో ఇంటర్నేషనల్ విమెన్స్ డేని నిర్వహిస్తున్నారు.

నవతెలంగాణ : మార్చి 8నే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎందుకు?

ఎస్సై : 1908లో న్యూయార్క్ నగర వీధుల్లో తమ హక్కుల సాధన కోసం వేలాది మంది మహిళా కార్మికులు నిర్వహించిన వీరోచిత పోరాటానికి గుర్తుగా మార్చి8న అంతర్జతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించారు. సుమారు 15 వేల మంది మహిళలు మహిళాహక్కుల ఉద్యమనేత క్లారా జెట్కిన్ నేతృత్వంలో ఈ ఉద్యమంలో పాల్గొన్నా రు. దీంతో పాటు మహిళలు ఓటు వేయాలనే డిమాండ్‌ను కూడా ఇందులో చేర్చారు.

నవతెలంగాణ : మనదేశం గర్వించే మహిళల గురించి తెలపండి ? ప్రజలకు మీరిచ్చే సలహా ఏమిటీ ?

ఎస్సై : భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి ఇందిరాగాంధీ భారతదే శానికి 3వ ప్రధానమంత్రి, భారత మొదటి ఏకైక మహిళా ప్రధానమంత్రి కూడా. ఇందిరాగాంధీ తన తండ్రి జవహర్ లాల్ నెహ్రూ తర్వాత జనవరి 1966 నుండి 1977 మార్చి వరకు ఆ తర్వాత 1980 జనవరి నుండి అక్టోబరు 1984 వరకు పీఎంగా పనిచేశారు. మనమందరం స్కూల్లో కల్పనాచావ్లా గురించి చదివాం లేదా విన్నాం. ఆమె భారతీయ సంతతికి చెందిన మొదటి అమెరికన్ వ్యోమగామి, ఇంజినీర్. ఆమె అంతరిక్షంలోకి వెళ్లిన భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళ. తద్వారా ఆమె మనదేశం గర్వించేలా చేసింది. ఆమెభూమికి చేరే చివరి క్షణంలో ఫ్లైట్లో సాంకేతిక కారణాల వల్ల మరణించింది. కానీ, ఆమెను భారత్ ఇప్పటికీ నేషనల్ హీరోగానే పరిగణిస్తోంది. మేరీకోమ్ ఒక భారతీయ బాక్సర్, పార్లమెంటు సభ్యురాలు కూడా. మహిళా బాక్సర్‌గా, ప్రపంచ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌ను ఆరుసార్లు గెలుచుకున్న ఏకైక మహిళ, మొదటి ఏడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో ప్రతి ఒక్కదానిలో పతకాన్ని గెలుచుకున్న ఏకైకమహిళ. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఎనిమిది పతకాలు సాధించిన ఏకైక బాక్సర్ కూడా ఆమె. మేరీకోమ్ జీవితం ఆధారంగా ప్రియాంక చోప్రా నటించిన సినిమా తీశారు. దుర్గాబాయి కామత్‌కుమార్తె, కమలాబాయి గోఖలే భారతీయ సినిమా తొలి మహిళా నటి. ఆమెను తన చలన చిత్రం మోహిని భస్మాసుర్ కోసం ఎంపిక చేసిన భారతదేశపు అగ్రగామి చిత్రనిర్మాత దాదాసాహెబ్ ఫాల్కే ద్వారా ఎంపికైంది. సినిమాలో ఆమె తల్లి దుర్గాబాయి కి అమ్మగా కనిపించింది. అలాగే ఐపీఎస్ అదికారి కిరణ్ బేడీ, బ్యాట్మెంటన్ లో పివి సింధు, క్రికెట్లో మిథాలీరాజ్, ఇలా చెప్పుకుంటూపోతే నేడు మహళలు అన్నిరంగాలలో రానిస్తున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో కష్టపడి సమాజంపట్ల అప్రమత్తతో మెలిగి మహిళలు అన్నిరంగాలలో రాణించాలి.

మహాశివరాత్రి, అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు























రానున్న లోకసభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-వరంగల్

రానున్న లోకసభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యమని వరంగల్ జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. నగరంలోని మట్టెవాడ ప్రభుత్వ బాలికల పాఠశాలలో మాక్ ఎలక్షన్స్ పోల్ నిర్వహించారు. బడి పిల్లలకు ఓటు ఎలా వేయాలో నేర్పడంతో పాటుతో పాటు ఓటు విలువ గురించి తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు తమ ఇంట్లో వాళ్లతో పాటు పరిసర ప్రాంతాల వారికి ఓటు ప్రాముఖ్యతను వివరించి తప్పకుండా వారిచే ఓటు వేయించాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల కన్నా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఓటింగ్ శాతం తగ్గిందని, పార్లమెంట్ ఎన్నికల్లో పునరావతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు



వినియోగించుకునేలా ముమ్మర ప్రచారం చేస్తున్నామని భాగ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్, ప్రధాన ఉపాధ్యులు అరుణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



శేఖర్‌రావుకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింత నెక్కొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది శేఖర్‌రావుకు కాంగ్రెస్ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం శేఖర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్,నాయకులు గురువా రావు, చలపతిరావు,గణేష్,జే.వెంకటేశ్వర రావు,వంగ సాయిలు, ఐ.రమేష్ పాల్గొన్నారు.



గుడికి ప్రహరీ నిర్మించాలని వినతి

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింత నెక్కొండలోని శ్రీ రాముల వారి గుడికి ప్రహరీ గోడను నిర్మించాలని గురువారం చింత నెక్కొండ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజుకు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అతి పురాతన దేవాలయంగా పేరొందిన శ్రీరామాలయానికి ప్రహరీ గోడ లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని, ఎమ్మెల్యే చొరవ తీసుకుని ప్రహరీ గోడ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.అలాగే పోచమ్మ గుడి నుండి డబుల్ బెడ్‌రూం ఇండ్ల వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, విద్యుత్ సబ్ స్టేషన్ నుండి ఏబీతండా లింకు రోడ్డు వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పల్లెపాటి గురువారావు, చలపతి రావు, ఎద్దు గణేష్, రమేష్, వెంకటేశ్వరరావు, సాంబయ్య, రమేష్, నల్లపు సూరయ్య తది తరులు పాల్గొన్నారు.



వెల్ఫేర్ సభ్యత్వం తప్పనిసరి పొందాలి

నవతెలంగాణ-పర్వతగిరి

పీఆర్టీయు సభ్యుడు వెల్ఫేర్ సభ్యత్వం తప్పనిసరి పొందాలి అని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ గఫార్ కోరారు. టియస్ పర్వతగిరి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం జడ్పీహెచ్‌ఎస్ గోపనపల్లి ఉపాధ్యాయులకు పంచాయతీరాజ్ టీచర్స్ వెల్ఫేర్ బాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పీఆర్టీయు సభ్యుడు వెల్ఫేర్ సభ్యత్వం తప్పనిసరిగా పొందాలని వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు భూక్యా రాములు, ప్రధాన కార్యదర్శి వుగ్గె రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. లింగమూర్తి,ఉపాధ్యాయులు మహ్మద్ ఫరీద్, కె ప్రణయ్ కుమార్, పూర్ణచందర్, జి రమేశ్ గారు, సదానందం తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన తాడు గుంజుడు పోటీలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలోని శ్రీ పర్వతాల శివాలయం వద్ద గురువారం జరిగిన బరువు(తాడు గుంజుడు) పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కల్లెడ గ్రామ శివారు నరెంగతండాకు రూ.40 వేలు, రెండో బహుమతి నెక్కొండ మండలం పిట్టకాల తండాకు రూ30 వేలు, మూడో బహుమతి కల్లెడకు 20వేలు, నాలుగో బహుమతి నెక్కొండ మండలం వెంకటాపురంకు రూ.10వేలు నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్‌రెడ్డి స్థానిక నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



వరంగల్ డీఆర్వోగా శ్రీనివాస్

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ జిల్లా రెవెన్యూ అధికారిగా కె శ్రీనివాస్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఆర్ఓ కు శుభాకాంక్షలు తెలిపారు.

తెగిందంటే.. ప్రాణాలు బలి..!

- అధిక లోడ్‌తో తరుచూ షార్ట్ సర్క్యూట్
- తండాకు ఒకే ట్రాన్స్ ఫార్మర్‌తో పొంచిఉన్న ప్రమాదం
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



నవతెలంగాణ-పర్వతగిరి

పొరపాటున ఆ కరెంట్ తీగ తెగిందో.. భారీ ప్రాణ నష్టం వాటిల్లనుంది. రోడ్డు ఇవతల నుంచి అవతలి వైపునకు ఉన్న విద్యుత్ తీగ తెగి కింద పడితే దాన్ని గమనించక అలాగే ముందుకు కాలు మోపితే కాటికి వెళ్లాల్సిందే. ఇంత ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ సంబంధిత విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తుండటంపై తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకి వెళితే...

పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్ ఉంది. అయితే అధిక లోడ్‌తో తరుచూ ఇలాగే వైర్లకు షార్ట్ సర్క్యూట్ జరుగుతూ ఇలాగే ప్రమాదకరంగా మారుతాయి. ఈ విషయాన్ని తండావాసులు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తండా నుంచి మండలంలోని నెక్కొండ మండలంలోని రెడ్లవాడ వయా కేసముద్రం, మహబూబాబాద్ జిల్లాకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. అయితే తండాకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్ ఫార్మర్ కు మెయిన్ లైన్ మాత్రం రోడ్డు ఇవతల నుంచి అవతలి వైపునకు ఉంది. పొరపాటున విద్యుత్ తీగ తెగితే మాత్రం పెద్ద ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. గతంలో సైతం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని తెలిపిన కరెంట్ అధికారులు కన్నెత్తి చూడలేదని స్థానిక తండా వాసులు ఆరో పిస్తున్నారు. ఇటీవల మండలంలోని రావూరు గ్రామ శివారు మోత్యా తండాలో కరెంట్ కాటుతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మండలంలోని పలు గిరిజన తండాల్లో నెలకొన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే 20ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన తండాకు ఒక ట్రాన్స్ ఫార్మర్ పై అధిక లోడ్ పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి అదనపు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుతో పాటు తీగలను సైతం సరి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హక్కుల కోసం మహిళలు సంఘటితంగా పోరాడాలి



- ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల
- ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ కాశిబుగ్గ

తమ హక్కుల సాధన కోసం మహిళలు ఐక్యంగా ఉద్యమించి సాధించుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నళిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు వరంగల్ రైల్వే స్టేషన్ నుండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నలిగంటి రత్నమాల మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే కేకు కటింగ్ చేసి వేడుకలు జరుపుకోవడం కాదని అన్నారు. మహిళా శ్రామికులు సమాన పనికి సమాన వేతనం కావాలని ఎనిమిది గంటల పని దినాలు, ఓటు హక్కు కావాలని పెద్ద ఎత్తున 30వేల మంది మహిళా కార్మికులు అమెరికాలో ప్రదర్శన చేయగా అక్కడి ప్రభుత్వం మహిళలపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 156 మందిని పొట్టన పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చిందించిన రక్తం వల్లనే నేడు మహిళలు తమ హక్కులను అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. అది మహిళలు సాధించిన గొప్ప విజయం అని కానీ ప్రభుత్వాలు ఇది చెప్పకుండా చరిత్రను వక్రీకరిస్తూ మహిళా సాధికారికత అంటే కేక్ కటింగ్ చేసి పండగలు జరుపుకోవడం అని చెప్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని ఇది చాలా దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల హక్కులను కాలరాస్తూ చట్టసభలలో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు అమలు చేస్తున్నట్లు చెబుతూనే వాయిదా వేస్తుందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించకుండా మహిళా అభివద్ధి ఎలా సాధ్యమని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో మహిళలపై హింస, వేధింపులు పెరుగుతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మహిళల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వెంకటలక్ష్మి రేణుక, సంగీత, కీర్తి, కల్పన, మంజుల, సరిత, జ్యోతి, లక్ష్మి ఫరీదా పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి

జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య
ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-వరంగల్

మహిళల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని నాయుడుపెట్రోల్ పంప్ సమీపంలో గల వినయ్ గార్డెన్స్‌లో గురువారం జిల్లా సంక్షేమ అధికారి శారద అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, సంధ్యా రాణి, అధికారులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ఉత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 8న అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటామని, ఈ సంవత్సరం మహిళలలో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండి అనే అంశంపై నిర్వహి స్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థిక పెట్టుబడితో పాటు విద్య, ఉన్నత విద్య, ఆరోగ్య పరంగా పెట్టుబడులు పెట్టి సమగ్ర అభివద్ధి చెందాలన్నారు. పిల్లలకు విద్యాపరంగా ఉన్నత మైన విద్య అందించి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని, ఆరోగ్యపరంగా మహిళలతోపాటు గర్భవతులకు బాలింతలకు పౌష్టిక ఆహార అందిం చి ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. జిల్లాలో మహిళా అధికారుల సహాయ సహకారాలతో అభివద్ధి పథంలో వెళుతుందన్నారు. జిల్లా సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 54వేల పిల్లలకు పౌష్టికాహారం అంగన్వాడీల ద్వారా విద్య అందించ డం జరుగుతుందన్నారు.సఖి కేంద్రాల ద్వారా జిల్లాలోని 700 మంది కేసులను పరిష్కరించడం జరిగిందని, సఖీ, సిడబ్ల్యుసి, అంగన్వాడీల సమన్వయ సహకారంతో జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టామని, బాధితులకు 50లక్షల రూపాయల పరిహారం అందించడం జరిగిందన్నారు. సంస్కారం కలిగిన భావితరాలను అందించడంలో మహిళల



పాత్రఎంతో కీలకమన్నారు. మహిళలతో సష్టి మనుగడ సాధ్యమవుతుందని వారిపై వివక్షత లేకుండా అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సంధ్యారాణి మాట్లాడారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలను శాలువాలతో సత్కరించి ప్రశంస పత్రాలను అందజేశారు. వివిధ క్రీడలలో గెలుపొందిన మహిళలకు జ్ఞాపికాలు, ప్రశంసాపత్రాలు కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు అందించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు అధికారులు కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానాషమీమ్ మసూద్, స్థానిక కార్పొరేటర్లు అరుణ విక్టర్, గుండు చందన పూర్ణ చందర్, పోశాల పద్మ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా క్రీడల అధికారి సత్యవాణి, సి డబ్ల్యు సి చైర్ పర్సన్ వసుధ, సీడీపీవోలు అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మహి ళల్లో పెట్టుబడి పెట్టండి పురోగతిని వేగవంతం చేయండి అనే నినాదంతో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీపై కలెక్టర్, అదనపు కలెక్టర్లు అధికారులు తదితరులు సంతకాలు చేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



ఏఐటీయూసీ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-వరంగల్

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐటీయూసీ వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, తోట బిక్షపతి ఆధ్వర్యంలో డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, పెండింగులో ఉన్న 3నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. డీఎంఅండ్ హెచ్ ఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ హనుమకొండ వరంగల్ జిల్లాలు ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ ఉద్యోగుల ధర్నా నిర్వహించారు. అనంతరం హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి సాంబశివరావు, వరంగల్ డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ ఐ ప్రకాష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ గత 23 ఏండ్ల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద బడుగు ప్రజలకు సేవ అందించడంలో ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని, వీరిని శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ కే డాక్టర్స్ దుర్గాప్రసాద్, డాక్టర్ రవీందర్, డాక్టర్ మోహన్, డైక్ అనిల్‌కుమార్, వరంగల్ జిల్లా అర్బన్ హెల్త్ సెంటర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జన్ను కొర్నేల్, అనిల్‌కుమార్, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ కాశిబుగ్గ

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం ఎల్బీనగర్ లోని హిందూ ముక్తి స్థల్ ఆవరణలో శ్రీలక్ష్మి-నారాయణ, శివపార్వతుల (వటవక్ష) కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గజ్జెల రాజ్‌కుమార్ శాస్త్రి, కోడం ప్రవీణ్‌కుమార్ శాస్త్రి, వంగర భాస్కర్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వరంగల్ నగరంలోని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో హిందూ ముక్తిస్థల్ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు బూర రామచందర్, పడాల నర్సింగరావు ప్రతినిధులు శీలం బాబురావు, వంగరి భాస్కర్, సుధాకర్, రాజు, ఉప్పలయ్య ప్రభాకర్, ఎల్లయ్య, అకేన వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.



'తూర్పు' కాంగ్రెస్ నాయకుల సమావేశం

నవతెలంగాణ కాశిబుగ్గ

వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం కాశిబుగ్గలోని పీసీసీ సభ్యుడు నల్గొండ రమేష్ ఇంటి వద్ద సమావేశమయ్యారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో కార్పొరేటర్లు చేరడాన్ని వీళ్ల తీవ్రంగా వ్యతిరేకించారు. పార్టీ అధికారంలో లేకున్నా తాము పార్టీ కోసం పని చేశామని, ఈ క్రమంలో బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే, కార్పొరేటర్లు తమను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని, అలాంటి వారిని పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు తమను ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన కార్పొరేటర్లతో తాము ఎలా కలిసి పని చేయాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి కష్టపడుతున్న వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. అందరి వాదనలు విన్న నల్గొండ రమేష్ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ పార్టీ కోసం మొదటి నుండి కష్ట పడుతున్న వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.కొండా దంపతులతో మాట్లాడి అందరికీ తగిన గౌరవం గుర్తింపు ఉండేలా చూస్తానని హామీ ఇచ్చారు.



పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి

గ్రామీణ ప్రాంతాల ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీఎం మురళీ కష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్‌లో తెలంగాణలోనే మొట్టమొదటి సుకన్య అకౌంట్ క్లోజింగ్ చేశారు. ఈ సందర్భంగా పర్వతగిరికి చెందిన జి కష్ణవేణికి ఆమె పెళ్లి కోసం గురువారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మన భవిష్యత్ జీవితానికి ఇదొక మలుపు అని, ప్రతీ ఒక్కరూ చిన్న మొత్తాలలో పెద్ద మొత్తాలుగా మార్చుకుని ఆర్థికాభివద్ధిని సాధించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది రాజు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.



బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా వంశీకష్ణ

నవతెలంగాణ-పర్వతగిరి

బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) వరంగల్ జిల్లా కార్యదర్శిగా పర్వతగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన జేరిపోతుల వంశీకష్ణ ను నియమిస్తున్నట్లు బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షులు మాసాని రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాసాని రమేష్ మాట్లాడుతూ బీఎస్పీ పార్టీని, గుర్తును ప్రజల్లోకి మరింత తీసుకు వెళ్ళేందుకు కంకణ బద్ధులై అందరూ పనిచేయాలని అన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించేందుకుకష్టపడి పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శిగా ఎన్నికైన జెరిపోతుల వంశీకష్ణ మాట్లాడుతూ మహనీయుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన బహుజన సమాజ్ లాంటి గొప్ప పార్టీలో భాగస్వామిని పని చేసేందుకు సంతోషిస్తున్నానని అన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పజెప్పిన జిల్లా కమిటీ నాయకులందరికీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

'శివరాత్రి'ని ఘనంగా జరుపుకోవాలి

దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

మహాశివరాత్రి పర్వ దినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని అటవీ పర్యావరణ దేవా దాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రక టనలో పేర్కొన్నారు. మహా శివరాత్రిని పురస్క రించు కుని రాష్ట్ర ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా చేపట్టే ఉపవాసం, జాగరణలు ఆత్మ శుద్ధిని కలిగిస్తాయని మంత్రి అన్నారు. భక్తితో పండుగను జరుపుకోవాలని కోరారు.

విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక ఆలోచనలు రావడం అభినందనయం

● హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నవతెలంగాణ-హన్మకొండ

విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆలోచనలురావడం అభినందనీయమని హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటున్న విద్యార్థులు భావిజీవితంలో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి కృషి చేస్తున్న స్మైల్ ఫౌండేషన్‌కు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రదర్శించే విధంగా కార్యక్రమం నిర్వహించిన స్మైల్ ఫౌండేషన్, విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శాస్త్ర సాంకేతిక అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల సైన్స్ అధికారులు శ్రీనివాస్, ఎంజెపి టీబీసీ ఆర్సిఓ మనోహర్‌రెడ్డి, చీఫ్ మానిటరింగ్



ఆఫీసర్ రాధ, శ్రీనివాసచారి, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ అజిజుద్దీన్, ఎం.కిషోర్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే నాయిని



నవతెలంగాణ-సుబేదారి

ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం డైరీ ఆవిష్కరణ, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియంలో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీఓస్ కేంద్ర సంఘ మాజీ అధ్యక్షులు కారెం రవీందర్‌రెడ్డి ఉద్యోగ సంఘాల మాజీ జేఏసీ చైర్మన్ పరిటాల సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నా గెలుపులో ఉద్యోగుల పాత్ర ఎంతగానో వుందని వారందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియ చేస్తున్నానని మీకు పూర్తిస్థాయి అండదండలు ఉంటాయని మీ సమస్యలపై ముఖ్యమంత్రికి సంపూర్ణమైన అవగాహన ఉందన్నారు. వారు సమస్యలను పరిష్కరించే దిశలో ఉన్నారని,ప్రభుత్వానికి ఉద్యోగులు అండగా వుండాలన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా వుంటుందని అన్నారు. ఉద్యోగులందరికీ అందుబాటులో ఉంటానని జిల్లా అభివృద్ధికి మీతో కలిసి పని చేస్తానన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఉద్యోగినులు అందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన పలు తీర్మానాలను హర్షధ్వానాల మధ్య ఆమోదించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జిల్లాలోని పలువురు మహిళా ఉద్యోగినులను ఘనంగా సన్మానించడం జరిగినది. మరియు అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, సంస్కృతి కార్యక్రమాల్లో గెలుపొందిన వారికి ముఖ్యఅతిథిగా చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

సమావేశానంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పలు తీర్మానాలు చేశారు. 2004 నుండి నియమితులైన ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని, ఉద్యోగులు మరణిస్తే 10 రోజుల్లోనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, 317 జీఓలో భాగంగా 13జిల్లాల్లో బ్లాక్ చేయబడిన స్పోస్ బదిలీలను వెంటనే చేపట్టాలి అని వారు తీర్మానం చేశారు. 317 జీఓ వల్ల ఉత్పన్నమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని,పెండింగ్లో ఉన్న డిఏ లను వెంటనే విడుదల చేయాలని జులై 2023 నుండి నూతన పిఆర్సి అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెలరాజేష్ కేంద్ర సంఘ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, రామినేని శ్రీనివాసరావు, శ్యాంసుందర్, రామునాయక్, సారంగపాణి, మాయిస్, లక్ష్మీప్రసాద్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలి : ఎమ్మెల్యే రేవూరి



నవతెలంగాణ-పరకాల

గ్రామసమస్యల పరిష్కారానికి ప్రజా పాలకులు, అధికారులు సమిష్టిగా కృషిచేసినప్పుడే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో పెద్ది ఆంజనేయుల అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే రేవుల ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల వారిగా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను పాలకులు, అధికారులు అడిగి తెలుసుకుని పరిష్కారానికి ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాలని అన్నారు.రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేసి ప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా మసులుకొని ప్రజల అభిమానాన్ని పొందాలన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల శాఖల అధికారులచే సమస్యలను తెలుసుకొని ఆ సమస్యల పరిష్కారానికి బాధ్యతతో పనులు చేసినప్పుడే ప్రజల అభివృద్ధి జరుగుతుందని అప్పుడే ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని అన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు చేపట్టాలి

వచ్చే వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దటి రాకుండా పాలకులు ,అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలంటూ అందుకు అవసరమైన త్రాగునీటి ఎద్దడికి ఓపెన్ వెల్లి నుండి డైరెక్ట్‌గా నీటి పంపింగ్ చేయుటకు ఎస్‌డిఎఫ్ నిధుల ద్వారా రూ.24.50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని ,విద్యుత్ శాఖ అధికారులు కరెంటు అంతరాయం కలగకుండా కరెంటు లైన్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రూ.16 లక్షల నిధులను సిడిఆర్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా వ్యవసాయరంగంలో రైతులకు పంట నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ సబ్సిడీతో ఎరువుల, విత్తనాలను అందించేలా సంబంధితశాఖ అధికారులు ప్రత్యేక చూపాలని ఆదేశించారు.

వైద్య ఆరోగ్య సంబంధించిన శాఖ అధికారులు వచ్చే వేసవిని దష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా ముందస్తుగా ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను కేటాయించి వైద్య సహాయం అందించాలని అన్నారు. అనంతరం మొదటిసారిగా స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రావడంతో పాలకులు, అధికారులు ఘనంగా శాలువాతో సన్మానించారు.అదేవిధంగా సమాజా నికి మహిళలే ఆదర్శమంటూ మహిళ అధికారులను అంతర్జాతీయ మహిళల దినోత్సవ సందర్భంగా ఒక్కొక్కరిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ మొగిలి, అధికారులు, గ్రామ పాలకులు, సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం : బీఆర్ఎస్

ఎల్ఆర్ఎస్‌ను ఎత్తివేయాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-హనుమకొండ



కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లో ఎండగడతామని ఎల్ఆర్ఎస్ స్కీము వెంటనే ఎత్తి వేయాలని బీఆర్ఎస్ నాయకులు దాస్యం వినయ్ భాస్కర్ ఎమ్మెల్సీ బస్వరాజు సార య్యలు డిమాండ్ చేశారు. హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి ఎల్ఆర్ఎస్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు అన్ని నియోజకవర్గాలలో ఎల్ఆర్ఎస్‌ను వెంటనే రద్దు చేయాలని బుధవారం ధర్నా నిర్వహించి గురువారం అడిషనల్ కలెక్టర్ ను కలిసి వినతిపత్రాన్ని అందజేసినట్లు వివరించారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి, మోసంచేసి 420 హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం మరొక అడుగు ముందుకు వేసి అధికారంలోకి వచ్చాక నాటి ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు చేస్తున్న వారిని మోసం చేస్తూ రూ.20వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఈ పన్నాగం పన్నిందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ వినతిపత్రం జరిగిందన్నారు. ఎల్ఆర్ఎస్‌ను విరమించుకోకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజుయాదవ్, జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, ఇమ్మడి లోహిత రాజు, కో-ఆర్డినేటర్ పులి రజనీకాంత్, ఉడుతల సారంగపాణి, నార్లగిరి రమేష్, మట్టపల్లి రమేష్, వేణు, సుంచు కష్ణ, నయిముద్దీన్, జోరిక రమేష్, కుసుమ లక్ష్మీనారాయణ, కేశవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

100శాతం పన్నులు వసూలు చేయాలి


నవతెలంగాణ-శాయంపేట



గ్రామపంచాయతీ పరిధిలో బకాయిలో ఉన్న ఇంటి, నల్లా పన్నులను ఈ నెలాఖరు వరకు 100 శాతం వసూలు చేయాలని పరకాల డీఎల్‌పీఓ షర్ఫొద్దీన్ అన్నారు. శాయంపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, గ్రామ నర్సరీ, డంపింగ్ యార్డ్ ను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులను వేగవంతంగా చేయించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం గ్రామ స్పెషల్ ఆఫీసర్, తహశీల్దార్ సుభాషినితో కలిసి మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా మల్టీపర్పస్ సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, కారోబార్ బాసాని రమేష్ పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి నేటి విద్యార్థులదే : రేవూరి

నవతెలంగాణ-పరకాల



సమాజాన్ని మార్చే శక్తి నేటి విద్యార్థులపై ఉందని అందుకు సమాజంలో మార్పు చైతన్యం తీసుకురావడానికి విద్యాసంస్థలు నాంది పలకాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక గణపతి డిగ్రీ కళాశాల ఆవరణంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానసభ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడంతో విద్యార్థులు కవాతు చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్దేశకులు విద్యార్థులే అంటూ ప్రజల్లో చైతన్యం వస్తేనే రాజకీయాలలో డబ్బు ప్రభావం తగ్గుతుంది అందుకు మార్పు రావాలంటే విద్యార్థి శక్తి సమాజానికి మూలం అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం పడుతున్నఇబ్బందులు పరిష్కరించేందుకు కషి చేస్తానంటూ దివంగత నేత వైఎస్ఆర్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఉన్నత విద్య చదవడానికి అవకాశం కల్పిస్తే నేడు ఎంతోమంది ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వానికి 10 సంవత్సరాలు ప్రజలు అవకాశం ఇస్తే 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని లక్షలకోట్ల అప్పుల రాష్ట్రంగా మిగిల్చడం తన దారుణమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించి విద్యాసంస్థల తో పాటు విద్యార్థుల అభివృద్ధికి పాటుపడేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల యాజమాన్యంతో పాటు ప్రజాప్రతినిధుల సోదరామకష్ణ, కొయ్యడ నివాస్, నరసింహరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనలో సీఎం రేవంత్‌రెడ్డి : ఎమ్మెల్యే కడియం



నవతెలంగాణ-సుబేదారి

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి పదవిపోతుందనే భయం పట్టుకుందని స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు.. సీఎం రేవంత్ రెడ్డి బుధవారం జరిగిన ఒక పబ్లిక్ మీటింగ్‌లో వారి సహచర క్యాబినెట్ మంత్రుల సమక్షంలోనే తన సీటుకు ఇబ్బంది కలిగించే వారి తోక ఎలా కత్తిరించాలో తెలుసు అని అన్నారని దీనినిబట్టి ఆయన పదవి పోతుందనే భయం పట్టుకుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మంత్రులతోనే సీఎం రేవంత్‌రెడ్డికి పదవి పోతుందనే భయం ఉందన్నారు. మీలో మీరు కుమ్ములాటుకుంటూ మాపై విమర్శలు చేస్తారా ? అని ఆయన అన్నారు. 6 గ్యారెంటీల అమలు పేరుతో అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పుడు ఎలా అమలు చేయాలో అర్థం కావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 11న భద్రాచలంలో ప్రారంభించబోయే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వేలకోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ఏడాదిలోపే 4లక్షల 50 వేల ఇళ్లనిర్మాణం చేస్తామని హామి ఇచ్చారని అందుకు 25వేల కోట్లు అవసరం అవుతాయని బడ్జెట్‌లో రూ.7740కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. రాష్ట్రంలో 90లక్షల రేషన్ కార్డులు ఉండగా రూ.500రుపాయలకే గ్యాస్‌కనెక్షన్ ను అనేక నిబంధనలను సాకుగా చూపి 29లక్షల మందికే అమలు చేయబోతున్నారన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు సంబంధించి స్పష్టమైన విధానాలను రూపొందించలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్ల పోస్టులను భర్తీ చేసి 28వేల ఉద్యోగాలు తాము వచ్చాక భర్తీ చేసామని పత్రికల్లో వాణిజ్య ప్రకటనలు ఇస్తూ అబద్దాలు చెబుతున్నారన్నారు.

రైతు బంధు 3 ఎకరాల ఉన్న రైతు కు రాలేదని అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోపై రైతుల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకతను ఎదుర్కోంటుందన్నారు. సాగునీరు,. కరెంట్ సంబంధించి ఎలాంటి ప్రణాళి క లేకుండా ప్రభుత్వం ముందుకు సాగుతుందని వచ్చేవేసవిలో తీవ్రమైన నీటి ఎద్దడి, కరెంట్ కొరత ఈ ప్రభుత్వం ప్రణాళిక లోపం వల్ల ఏర్పడే అవకాశం ఉందన్నారు.

తనిష్క్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ప్రపంచంలోనే నాణ్యతకు మన్నికకు పేరెన్నికగన్న టాటా వారి ఉత్పత్తి తనిష్క్ బంగారు వజ్రాభరణాల స్టోర్ హనుమకొండలో అంబేద్కర్ విగ్రహం దగ్గర, తనిష్క్ సర్కిల్, నక్కలగుట్ట, హను మకొండవారు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాజరైన మహిళలు ఆనందోత్సాహాల నడుమ కార్యక్రమం ఎంత ఉల్లాసంగా ఆటల పాటలతో నృత్యాలతో తనిష్క్ యాజమాన్యం పోటీలను నిర్వహించినది. పోటీలలో పాల్గొన్న మహిళలకు యాజమాన్యం బహుమతులు అందించినట్లు తనిష్క్ వరంగల్ ఫ్రాంచైజీ మేనేజింగ్ పార్ట్నర్ ప్రముఖ సమాజ సేవకులు వ్యాపారవేత్త యశోద నారాయణరావు తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ సమాజంలో మహిళలు తమలో ఉన్న భయం అపోహలు వీడి తిరుగులేని మహిళ శక్తిగా అవతరించాలని ఆకాంక్షించారు. తనిష్క్ వరంగల్ ఫ్రాంచైజీ పార్ట్నర్ యశోద నారాయణరావు మాట్లాడుతూ నమ్మకాన్ని స్వచ్ఛతకు తనిష్క్ పెట్టింది పేరు అన్నారు. మహిళలు సాధిస్తున్న విజయాలకు స్ఫూర్తి



పొందుతూ అధైర్యం చెందకుండా ఘన విజయాలు సాధించాలని, దీనికి సంబంధించిన పరిజ్ఞానాన్ని యువతలో నింపుదామని పిలుపుని చ్చారు. మహిళల కోసం ప్రత్యేక సందర్భాల్లో వారికి చేప్పే ప్రత్యేక కలెక్షన్లు తనిష్కనందు ఉన్నాయన్నారు.

మహిళలందరితో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తనిష్క్ యాజమాన్యం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్‌సబ్ ఇన్స్పెక్టర్ దయా మణి, మహిళా శిశు సంక్షేమ రిటైర్డ్ అధికారిణి కళా కుమారి, ఎల్ఎన్.రేణుక, ఎల్ఎన్.ఉష, తనిష్క్ జ్యువెలర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల రక్షణ, సాధికారతకై ఉద్యమిద్దాం : నేదునూరి



నవతెలంగాణ-హన్మకొండ

సనాతన సంస్కృతి సాంప్రదాయాల పేరుతో మనవాదం పేరుతో ఆధునిక మనువాదులు దళిత ముస్లిం మైనారిటీ మహిళలను అణిచి వేయడం జరుగుతుందని మతకలహాల పేరుతో మహిళలు నిత్యం హింసింపబడుతున్నారని వీటిని అరికట్టడంలో మోడీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి విమర్శించారు. గురువారం హన్మకొండ మహిళా సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు రాసమల్ల దీన అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళలకు ఉచిత విద్య, వైద్యంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వాలు ఎన్ని పథకాలు ప్రకటించినా వారి ఆర్థిక స్థితిగతులు మారవన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి వారికి తగిన ప్రోత్సాహం రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో మహిళలను ఓట్ల బ్యాంకులుగా చూస్తున్నారని అన్ని రాజకీయ పార్టీలు మహిళల సాధికారతకై మహిళలకు తగినంత ప్రాతినిథ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి మాట్లాడుతూ శ్రామిక మహిళలు చేసిన పోరాటం మహిళలందరికీ స్ఫూర్తినిచ్చిం దని వారి స్ఫూర్తితో మహిళలకు సమాన అవకాశాల కొరకు స్వేచ్ఛ సమానత్వాని కి హింస లేని సమాజ నిర్మాణం కోసం మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చా రు. మోడీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నా రని రాముని పేరుతో ఓట్లరాజకీయం చేస్తున్నారని లౌకి కవాదాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను మహిళలం దరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో రాజారపు అనిత రామ, మధునమ్మ, జ్యోతి, లావణ్యరాణి ఆశీర్వమ్మ తదితరులు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-పరకాల

మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని 21వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఆర్పీ జయంతిలాల్ గురువారం రూ.7లక్షల నిధులతో సీసీ రోడ్డు, సైడ్ కాలువల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపా లిటీ అభివృద్ధిలో భాగంగా 14 ఫైనాన్స్ నిధులతో సిసి రోడ్లు, సైడు కాలువల పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమ అభివృద్ధిలో అనునిత్యం ప్రజలతో మమేకమై అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేగురి జయపాల్ రెడ్డి, కమిషనర్ నరసింహ, కౌన్సిలర్ రాజు,నాయకులు సోదరా రామకృష్ణ, బిక్షపతి, పసుల రమేష్, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



బీసీ హాస్టళ్లలో అవినీతిపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-సుబేదారి



హనుమకొండ జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టళ్ల నీతిలో కూరుకుపోయాయని, వార్డెన్ల ఆకత్యాలు తారాస్థాయికి చేరాయని వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ అధికారి రాంరెడ్డిని కలిసి విద్యార్థి సంఘాలు వినతిపత్రం అందజేశారు. అనంతరం పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మొగలి వెంకటరెడ్డి, యుఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు రాజేష్ నాయక్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి బొక్కల నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్‌లు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్న బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆహారంలో నాణ్యత లోపిస్తుందని, విద్యార్థుల సంఖ్యను అధికంగా చూపించి అవినీతికి పాల్పడుతున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు రంజిత్, వేల్పుల చరణ్, బాలగోని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తుచేస్తూ అంతర్జాతీయా మహిళా దినోత్సవం జరుపుకుంటామని వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గురువారం కిషన్‌పురలోని సిటీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సాధించిన విజయాల గురించి మాట్లాడటమే కాకుండా హక్కులను గుర్తించి మహిళా సమానత్వం, సాధికారిత, సమాజిక అవగాహన, వీటిసాధనకోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ పులి శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ ఎం.సత్యనారాయణరెడ్డి, వంగా రాజేందర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, ఐఎన్‌టీయూసీ 327 రాష్ట్ర కార్యదర్శి ఇనగాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-శాయంపేట



ప్రస్తుత సమాజం ఆన్‌లైన్‌తో ముడిపడి ఉందని, సైబర్ నేరగాళ్లు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలే లక్ష్యంగా మోసం చేస్తున్నారని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మారేపల్లి క్రాంతి కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం, భారతీయ రిజర్వ్ బ్యాంక్ సహకారంతో వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మారేపల్లి విజయ్, రవిపాల్, కష్ణారెడ్డి, రామ్మూర్తి, స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షునిగా మహేందర్

నవతెలంగాణ-ఎల్కతుర్తి



బీఆర్ఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడుగా ఉద్యమకారుడు సూరారం గ్రామానికి చెందిన పిట్టల మహేందర్‌ను గురువారం కరీంనగర్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ నియమించారు. ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌లకు కతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల వైస్ ఎంపీపీ తంగడ నాగేష్, మార్కెట్ డైరెక్టర్ తంగడ మహేందర్, రైల్వే బోర్డ్ మెంబర్ యేల్పూరి స్వామి, టిఆర్ఎస్ సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



నవతెలంగాణ-జనగామ

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వచ్చే సమస్యలను అధికారులు నిబద్ధతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి, మహాలక్ష్మి దరఖాస్తుల నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. అలాగే దరఖాస్తుల నమోదు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల నమోదుపై అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-జనగామ



బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంత్రి సీతక్క కాన్వాయ్‌ని బీఎస్పీ నాయకులు అడ్డుకునేందుకు యత్నించారు. గురువారం జనగామ పట్టణ సమీపంలోని సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృద్ధ ఆశ్రమాన్ని ప్రారంభించి వస్తున్న సందర్భంలో జనగాం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలుపుతూ అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఎస్పి జనగామ జిల్లా అధ్యక్షుడు మద్దిపడిగె చెంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వమని హెచ్చరించారు.



450 రేషన్ బియ్యం బస్తాల పట్టివేత

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం 400 బస్తాలను పట్టుకున్నట్లు సివిల్ సప్లై జిల్లా అధికారి రోజా రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ వరంగల్ యూనిట్ అధికారులు అక్రమంగా పిడియస్ బియ్యం కొనుగోలు చేసి వేరే చోటకు తరలిస్తుండగా పట్టుకొని తగు చర్యకై డిటి పౌరసరఫరాల శాఖ ఇ.శ్రీనివాసుకు అప్పగించినట్లు తెలిపారు. 450బియ్యం బస్తాలు 211.95 క్వింటాళ్ల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ ఇంచార్జి వి.శ్రీధర్ రెడ్డికి అప్పగించినట్లు వివరించారు. లారీ డ్రైవర్ భూక్య బాల్య, బియ్యం లోడు చేసిన తోడేటి భుగులయ్య, లారీ ఓనర్ అయితే శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

31లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కోసం దరఖాస్తులు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

మార్చి 31 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కోసం అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యార్థినిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అమెరికా, స్విట్జర్లాండ్, ఇంగ్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా తదితర దేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆసక్తిగలవారు జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 2444 మంది హాజరు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా 18 పరీక్షా కేంద్రాలలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు 2480 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 36 మంది గైరాజరయ్యారని, 2444 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి పైరు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 1059 మంది విద్యార్థులు హాజరయ్యారని, 49 మంది గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో కలిపి 3580 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 85 మంది గైర్హాజరు అయ్యారని, 3,503 మంది పరీక్ష రాసినట్లు వివరించారు.



ఐమాక్స్ లైట్ల ప్రారంభం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మండలకేంద్రంలోని మోడల్ కాలనీలో జెడ్పీ నిధులతో చేపట్టిన ఐమాక్స్ లైట్లను గురువారం కాలనీ అధ్యక్షులు అక్కనపల్లి అంజయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చల్లా రఘు రెడ్డి, ఎండీ యాకూబ్, గుర్రం నర్సయ్య, కందికొండ సంపత్, కుమార్, శ్రీధర్, సాయి, లక్ష్మణ్, రాజన్న, డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ మంజూరైన 20 లక్షల రూపాయల వ్యయంతో 4 సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బయ్యారం సొసైటీలో కామన్ సర్వీస్ సెంటర్‌తో పాటు సొసైటీ ఆవరణంలో రైతులకు విశ్రాంతి భవనానికి 10 లక్షల వ్యయంతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. మండలంలోని మొట్లతిమ్మాపురం పంచాయతీ పరిధిలో ఐటీడీఏ నిధుల నుండి రెండుకోట్ల అంచనా వ్యయంతో మంజూరైన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గృహ జ్యోతి పథకాన్ని మొట్లతిమ్మాపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ బయ్యారం సొసైటీలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్లో మండలంలో ఉన్నటువంటి రైతులు ప్రజలు 15 రకాల సర్వీసులనుఆసెంటర్ ద్వారా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. మొట్లతిమ్మాపురం ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగకుండా హై లెవెల్ బ్రిడ్జిని నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి లక్ష్మీ, మాజీ కాంగ్రెస్ మండలాధ్యక్షులు, వైస్ ఎంపీపీ వేల్పుల శ్రీనివాస్, ఎంపీటీసీలు తిరుమల శైలజ ప్రభాకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ గట్ల లక్ష్మి గణేష్, బానోత్ మోహన్ జి, మాజీ ఎంపీటీసీ మంగీలాల్ నాయక్, మాజీ సర్పంచ్ స్వరూప, సొసైటీ డైరెక్టర్లు చాగండ్ల మూడి భాస్కరరావు, జూలకటి సీతారామరెడ్డి, చెరుకుపల్లి నాగమణి, పెద్దినేని వెంకటేశ్వరరావు, పగడాల శ్రీను, సూరం సుధాకర్ రెడ్డి, చల్ల సురేష్, గట్టు శ్రీనివాస్, రేఖ ఉప్పలయ్య, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎంపీడీవో

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో ఎస్కే సిలార్ సాహెబ్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చింతలపల్లి గ్రామంలో చేయితా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే సంఘాలుగా ఏర్పడి చేతివృత్తుల పనులను ప్రోత్సహించి ఆర్థికంగా నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఉమ్మడి జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, రాము, మేనేజర్ చారి, శ్రీదేవి మహిళలు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరిద్దాం... చేరదీద్దాం... అండగా ప్రభుత్వం

- ప్రతీ నియోజకవర్గానికి ఒక వృద్ధాశ్రమం ఏర్పాటుకు చర్యలు
- సుశీలమ్మ మహిళా వృద్ధాశ్రమం ప్రారంభించిన మంత్రి సీతక్క





నవతెలంగాణ-జనగామ

పెద్దలను... వృద్ధులను ఆదరించి చేర తీద్దామని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం జిల్లాలోని శామిర్పెట్ వద్ద కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3.20 ఎకరాల్లో రూ. 15 కోట్లతో నిర్మించిన మహిళా వృద్ధాప్య ఆశ్రమాన్ని (రుద్రమ దేవి ఓల్డ్ ఏజ్ హోం సొసైటీని) జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్, ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, లక్ష్మి, తదితరులతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం కోమటిరెడ్డి సుశీలమ్మ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతి నియోజకవర్గానికి ఒక వృద్ధాశ్రమాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పెద్దవాళ్ళు పసిపిల్లలతో సమానమని, వారి ఆలన పాలన చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వాళ్ళు లేకుంటే మనం లేమన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుంటే ఇలాంటి ఆశ్రమాల అవసరం మనకి రాదన్నారు. ప్రస్తుతం చాలా చోట్ల మహిళా మాతృమూర్తులు వృద్ధులు రోడ్డున పడుతున్న పరిస్థితి చూస్తున్నామన్నారు. దానికి తాము కన్నా కొడుకులు కూతుర్లే కారణమన్నారు. మన పెద్దలను ఆదరించి చేర తీయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వృద్ధులకు అండగా ఉంటుందని తెలిపారు. సుశీలమ్మ వృద్ధ ఆశ్రమానికి అవసరమైన మంచినీటి ఏర్పాటు కోసం అధికారులు తగినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, రాణి రుద్రమ్మ మహిళా సొసైటీ సీఈవో కవిత రెడ్డి, డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, వివిధ శాఖల అధికారులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించేందుకు కృషి : కడియం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



మల్లన్నగండి ఎడమ కాల్వద్వారా దిగువ ప్రాంత గ్రామాల చెరువులకు కుంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ జిల్లా బీఆర్ఎస్ నాయకులు, చిల్పూర్ దేవస్థాన మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో గురువారం పరిసర ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మల్లన్న గండి ఎడమ దిశగా ఫతేపూర్, బట్టువాని తండా, బోడ బండతండా, కుచిగుట్ట తండా, యాపల బోర్డు తండా, మల్యాపూర్ పల్లెలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. సుమారు 9వందల ఎకరాల ఆయకట్టు పరిధిలో కొత్త కుంట, బుడుగు కుంట, హనుమాన్ చెక్ డ్యాం, బులుసుల కుంటలకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తే తమ కష్టాలు తీరుతాయని రైతులు వివరించగా, త్వరలోనే సంభదిత శాఖ అధికారులతో చర్చించి సాగునీరు అందించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీధర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ రుప్లా నాయక్, మాజీ జెడ్పీటీసీ స్వామి నాయక్, నాయకులు రైతులు పాల్గొన్నారు.

కారు పార్టీకి కష్టాలే..!?

- బీఆర్ఎస్‌ను వీడనున్న కీలక నేతలు
- ఎంపీపీ సహా పలువురు ఎంపీటీసీలు..?
- జోరందుకున్న ప్రచారం...నేడో, రేపో హస్తం గూటికి
- ముహూర్తం కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-పాలకుర్తి

పాలకుర్తి నియోజకవర్గంలో కారు పార్టీకి కష్టాలు తప్పే పరిస్థితి లేదు. ఒక్కొక్కరుగా కారు పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. సొంత పార్టీ ప్రజాప్రతినిధుల పైనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అవిశ్వాసానికి కుట్ర చేస్తున్నాడని ప్రచారం జోరుగా ఊపందుకుంది. అందులో భాగంగానే పాలకుర్తి మండలంలోని ఎల్లారాయని తొర్రూర్ సొసైటీ చైర్మన్ పై అవిశ్వాసం పెట్టి తొలగించాలని కుట్రలో భాగంగా సుమారు 9 మంది డైరెక్టర్లు డిసిటకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. అవిశ్వాసం వీగిపోయేందుకు పసిగట్టి ముందస్తు చర్యలు చేపట్టడంలో సొసైటీ చైర్మన్ బోనె మైసిరెడ్డి పైచేయి సాధించాడు. కాంగ్రెస్ అధిష్టానం సైతం అండగా నిలిచింది. టిఆర్ఎస్‌కి గుడ్ బై చెప్పిన తొర్రూర్ సొసైటీ చైర్మన్ మైసిరెడ్డి, వైస్ చైర్మన్ రాందన్‌తో పాటు మరో ముగ్గురు డైరెక్టర్లతో హస్తం గూటికి చేరారు. అది మరువక ముందే మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపల్ చైర్మన్ హస్తం గూటికి చేరారు. పెద్దవంగర ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానానికి శ్రీకారంచుట్టారు. పాలకుర్తి ఎంపీపీ కాంగ్రెస్ గూటికి చేరేందుకే ముందస్తుగా తన అనుచరుడు తొర్రూర్ సొసైటీ చైర్మన్ గోనె మైసిరెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపించాడనే గుసగుసలు జరుగుచున్నాయి. పాలకుర్తి ఎంపీపీతో పాటు పలువురు ఎంపీటీసీలు టిఆర్ఎస్‌కి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారనే సమాచారం. నేడో... రేపో... హస్తం గూటికి చేరేందుకు కసరత్తు జరుగుతుందని ప్రచారం జోరందుకుంది. 2023 ఎన్నికల్లో కొంతమంది సర్పంచులతో పాటు టిఆర్ఎస్‌కు చెందిన ముఖ్య కార్యకర్తలు హస్తం గూటికి చేరడంతో ఎంపీపీ వర్గం కాంగ్రెస్ గూటికి చేరిందని విమర్శలు గుప్పించడంతో దయాకర్ రావు పూర్తిస్థాయిలో నమ్మకం కోల్పోయాడు. దీంతో ఎంపీపీపై మాజీ మంత్రికి పూర్తి స్థాయి వ్యతిరేకత పెరగడంతో నమ్మకాన్ని కోల్పోయాడు. ఓటమి చవిచూసినప్పటికీ పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వకుండా పనిచేయని వారికి, మోసాలు చేసే వారికి ప్రాధాన్యత ఇవ్వడం దయాకర్ రావుకు నైజంగా మారడంతో పాటు వెన్నతో పెట్టిన విద్య అనే విమర్శలు ఉన్నాయి.

సొంత పార్టీలో ఉన్న చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం చేయించడం, చైర్మన్, వైస్ చైర్మన్ కాంగ్రెస్ గూటికి వెళ్లడం ఎంపీపీపై తీవ్ర ప్రభావాన్ని చూపిందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎంపీపీ తో పాటు పలువురు మాజీ సర్పంచులు ప్రస్తుత ఎంపీటీసీలు గ్రామస్థాయి ముఖ్య కార్యకర్తలు సమాలోచనలో పడినట్లు సమాచారం. టిఆర్ఎస్‌కి గుడ్ బై చెప్పేందుకు ఇటీవలే కాలంలో కొంతమంది ఎంపీపీలు, జెడ్పీటీసీలు ముఖ్య నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారనే సమాచారం. ఏది ఏమైనా పాలకుర్తి నియోజకవర్గంలో కారు పార్టీకి మనుగడ లేదనే చెప్పుకోవచ్చు. ఈ విషయంపై ఎంపీపీ నల్ల నాగిరెడ్డిని వివరణ కోరగా ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

జాతరలో పరిశుభ్రతను పాటించాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-పాలకుర్తి

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని, జాతరలో పరిశుభ్రతను పాటించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశించారు. గురువారం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అంతకుముందు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి ఆటంకాలు జరగరాదని సూచించారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద ప్రోటోకాల్ పదవులు తలెత్త రాదని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రశాంతంగా స్వామి వారల కళ్యాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి అధికారులతో పాటు ఉత్సవకమిటీ సభ్యులు సమన్వయంతో బాధ్యతగా పనిచేయాలని అన్నారు. త్రాగునీటి సమస్య తలెత్తరాదని, జాతరలో పరిశుభ్రతను పాటించేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయానం పాటించాలని, క్యూ లైన్ ల ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు సహకరించాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి వేద మంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల ఉత్సాహ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి యాదవ్, ముత్తారం ఎంపీటీసీ బొమ్మగాని మానస భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ గడ్డం యాక సోమయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి సలీం, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల మండల అధ్యక్షులు లావుడియా భాస్కర్ నాయక్, బండిపెల్లి మనమ్మ, బైకాని ఐలేష్, పులి భాస్కర్ గౌడ్ తో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జీరో కరెంట్ బిల్లు అందజేత

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల్లో గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ జీరో బిల్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు బండారు దయాకర్ లబ్దిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కందాల కృష్ణమూర్తి, పొగాకుల రమేష్, పలుస వెంకన్న, పలుస నగేష్, శాగంటి రాముల, ముదురుకోల రమేష్, తండా శ్రీనివాస్, అడప రాములు, తండా రాములు, అగయ్య,నుకల స్వర్ణలత, సుమిల, ముదురుకోల అగమ్మ పలుస పద్మ, బండరు కవిత పాల్గొన్నారు.



ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-తరిగొప్పుల

మండలంలోని పోతారం గ్రామపంచాయతీ పరిధిలో గార్లకుంట కరువు పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీల సమక్షంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో ఏ. దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపు నిచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఆమనగంటి మహేందర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని మహిళా హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళా మండలి సభ్యుల చేత కేక్‌కట్ చేయించి మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను గురించి తెలిపారు. గ్రామ పారిశుద్ధ కార్మికురాలు పాకాల లక్ష్మిని వారి సేవలకు గుర్తుగా శాలువాతో సన్మానించారు.

ఎండీ అర్టి మీట్‌కు ఎంపికైన రాజ్ కుమార్

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన ఎల్ఐసి ఏజెంట్ ఊడుగుల రాజ్‌కుమార్ మహబూబాబాద్ బ్రాంచ్ పరిధిలో సబ్ బ్రాంచ్ తొర్రూర్‌లో అత్యధిక పాలసీలు చేసి ఐదు కోట్ల బిజినెస్ చేసి బ్రాంచిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండో సారి అమెరికా ఎండిఅర్టి మీట్ ఎంపికయ్యారని ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ సివిఎన్ సుబ్రహ్మణ్యం తెలిపారు. హన్మకొండలో జరిగిన సమావేశంలో అమెరికా మిలీనియం రౌండ్ టేబుల్ మీట్‌కు రాజ్ కుమార్ ఎంపికైన సందర్భంగా వరంగల్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం ఎల్ఐసి మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్ బస్వరాజ్ చేతులమీదుగా ఘనంగా మెమెంటో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ సుబ్రహ్మణ్యం సహకారంతో ఈ స్థాయికి చేరుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుండి కష్టపడి అమెరికా వెళ్ళుటకు రెండోసారి అర్హతసాధించినందుకు గ్రామ ప్రజలు, నాయకులు, మిత్రులు రాజ్‌కుమార్‌ను అభినందించారు.



పెండింగ్ డీఏలను ప్రకటించాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పభాకర్

నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్రంలో ఎన్నికలకోడ్ రాకముందే ఉపాధ్యాయుల పెండింగ్ డిఏలను ప్రకటించాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం నాడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీ సమావేశం సంఘంజిల్లా ఉపాధ్యక్షులు చెవుల నాగార్జున అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల కోడ్ రాకముందే పెండింగ్‌లోఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కొత్తగాఎన్నికైన పాలకపక్షం మేనిఫెస్టోలో పెట్టిన విధంగాఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న మధ్యంతర భృతిని ఐదు శాతం నుండి 23శాతానికి పెంచాలని, నూతన పిఆర్‌సిని జూలై 1, 2023 నుండి అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి భీమాండ్ల సారయ్య, నాయకులు కదారి శ్రీనివాస్, హరిచంద్ నాయక్, సునీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బెస్త సంపూర్ణకు ఘన సన్మానం

నవతెలంగాణ-మరిపెడ

అంగన్వాడి వర్కర్స్ అండ్ హేల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు, అబ్బాయి పాలెం (పత్తికుంటతండా) అంగన్వాడి టీచర్, బెస్త సంపూర్ణను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా సేవలందిస్తున్న ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామ్మోహన్ రెడ్డి, మరిపెడ ఐసిడిఎస్ సిడిపిఓ శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గృహహింస, వరకట్నం కేసులో జైలు, జరిమానా

- జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా మరిపెడ(బంగ్లా)కు చెందిన ఒకరికి తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత రెండు సంవత్సరాలు శిక్షతో పాటు జరిమానా విధించారని మరిపెడ ఎస్సై ఎస్.కె తాహెర్ బాబా తెలిపారు.గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2015లో మరిపెడ బంగ్లాకు చెందిన ఏడవెల్లి సజిత రెడ్డి భర్త ఏడవెల్లి వెంకట రమణరెడ్డి అదనపు కట్నం తీసుకురమ్మని ఇంట్లో వేధింపులకు గురి చేసే వాడు. వేధింపులు తట్టుకోలేక ఎడవల్లి సజిత రెడ్డి 2015 మరిపెడ పోలీస్‌స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా అప్పటి ఎస్సై వై.కృష్ణ కుమార్ కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం అప్పటి ఎస్సై జి.బాబు లాల్, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాదారాలను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ. గణేష్ ఆనంద్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత, ఎడవల్లి వెంకటరమణా రెడ్డి కి రెండు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 5000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్ట్ కానిస్టేబుల్ రామ్ నారాయణను తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ హతిరాం, ఎస్ఐ తాహేర్ బాబాలు అభినందించారు.

మదర్ చైల్డ్ హెల్త్ కిట్ పంపిణీ

- పీహెచ్‌సీ డాక్టర్ జి.రవి



నవతెలంగాణ- మరిపెడ

మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మండలంలోని అనేపురం గ్రామానికి చెందిన మల్లికంటి అనూష అనే గర్భిణీ పురిటి నొప్పులతో ఆసుపత్రికి రాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి అన్ని రకాల పరీక్షలు చేసి మొదటి కాన్పు సాధారణ ప్రసవం చేశారు. అనూషకు 3 కేజీల బరువుతో ఆడబిడ్డ జన్మనిచ్చిందని డాక్టర్ రవి తెలిపారు. తల్లి బిడ్డలను పరీక్షించి 3 రోజుల తర్వాత 16 వస్తువులతో కూడిన మదర్ చైల్డ్ హెల్త్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, స్టాఫ్ నర్స్ సుందరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర ప్రకటించాలి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్

నవతెలంగాణ-మరిపెడ

రైతు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ గురువారం దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సుధాకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మద్దతు ధర హక్కుగా అమలయ్యేటట్టుగా ప్రభుత్వంతక్షణమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, వ్యవసాయ ఉత్పత్తులు పెంచే విధంగా రైతాంగానికి ఎరువులు ఫెర్టిలైజర్స్ ఉచితంగా అందించి నాణ్యమైన విత్తనాలను అందించి రైతుకు మార్కెట్ సౌకర్యం కల్పించి రైతులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో రైతులు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వారంతా ఉద్యమాలు నడుపుతున్నారని పేర్కొన్నారు. కానీ రైతు సంక్షేమమే ఈ ప్రభుత్వ లక్ష్యమని చెప్తున్నటువంటి ప్రభుత్వాలు రైతును పట్టించుకోకుండా మద్దతు ధర ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. రైతులకు భూమి పరిరక్షణకు సంబంధించినటువంటి వ్యవసాయ శాఖఅధికారులు సలహాలు సూచనలతో పాటు ఏ పరివాహక ప్రాంతంలో ఆ పంటలు కనుగుణమైనటువంటి వ్యవసాయ సలహాలు సూచనలు అందిస్తూ రైతులకు నీటి వసతి ఎస్సారెస్పీ తల్లంపాడు డిబిఎం కాలువల ద్వారా నీరు అందించాలన్నారు.

అన్ని పద్ధతుల్లో రైతు పంటకు రెండు పంటలు నీటి సరఫరా అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులకు 50 సంవత్సరాల నిండిన రైతుకు 5000 పంచి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతు సహకార సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు ఇప్పటి వరకు ఉన్న రుణాలను మాఫీచేసి కొత్త రుణాలను ఇవ్వాలని కోరారు.



భవిష్యత్తులో రైతుకు భరోసాగా రైతు రక్షణ చట్టంగా రైతులను పరిరక్షించే విధంగా చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో సమస్యల సాధనకు దాట్లలో రైతులను సమీకరిస్తున్నట్లు ఈ నేపథ్యంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జిల్లా కమిటీ సభ్యులు కొమ్మినేని వెంకటరమణ, నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. దానికి రైతులు ఉత్సవంగా భవిష్యత్తు ఉద్యమాలలో తమావంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని రామేశ్వరం, మిడితపల్లి వెంకన్న, సమ్మెట వెంకన్న, కొమ్మినేని సతీష్, బాష్పంగు వెంకటయ్య, నరసింహారావు, రాములు,వెంకన్నలింగయ్య, సర్వం సోమిరెడ్డి, బిక్షపతి, సోమలింగం, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టరక్షణకై ఉద్యమించాలి

- వ్యాకాసా మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య

నవతెలంగాణ-మహబూబాబాద్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టరక్షణకై వ్యవసాయ కార్మికులు ఉద్యమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య పిలుపు నిచ్చారు. మార్చి 7న కురివి మండలం రాజోలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం బడ్జెట్లో నిధుల కోత విధించి పనులు తగ్గించి కొన్ని జిల్లాలకే మాత్రమే పనులు చూపాలని ప్రణాళికలు చేస్తున్నదని, కొత్త నిబంధన పేరుతో పని దినాలను కూలీల సంఖ్యను వేతనాలు తగ్గించాలని చూస్తున్నదని, వారం వారం డబ్బులు చెల్లించకుండా నెలల తరబడి కూలీలకు డబ్బులు చెల్లింపులు చేయడం లేదని, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కూలీలు చేసిన పనులకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వ్యవసాయ కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు షేక్ మల్సూరు, సంఘం మండల నాయకులు మనోహర్ వెంకన్న ఉపాధి కూలీలు పాల్గొన్నారు

మహిళ హక్కుల రక్షణకై నిలబడుదాం

- పీవోడబ్ల్యూ జిల్లా జిల్లా కోశాధికారి సామ రజిత
- సీపీఐ ఎంఎల్ ఎన్డీ సబ్ డివిజన్ కార్యదర్శి ఎస్కె బాబన్న

నవతెలంగాణ-మహబూబాబాద్



మహిళా హక్కుల రక్షణ కోసం నిలబడుదాం అని పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని పీవోడబ్ల్యూ జిల్లా కోశాధికారి సామ రజిత, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ఎస్కె బాబన్న పిలుపు నిచ్చారు. శ్రామిక మహిళా హక్కుల పోరాట దినాన్ని పురస్కరించుకొని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, మోట్లతండా గ్రామాల్లో గురువారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ మహిళా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. మహిళ హక్కుల రక్షణకై నిలబడాలని పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు రమణక్క అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐలక్క, ఎర్రక్క, బుజ్జి, సైదమ్మ, మాలి, సుక్కి, భానోత్ బుజ్జి, గమ్మి లక్ష్మి, మౌనిక, ఏకమ్మ, సుజాతలతో పాటు 50 మంది మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో గ్రామాల అభివృద్ధి

- కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి

నవతెలంగాణ-మరిపెడ



కాంగ్రెస్‌తోనే గిరిజన తండాలు అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి అన్నారు. మరిపెడ మండలంఅబ్బాయిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 10లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ఎస్సీ కాలనీలోని ప్రారంభించారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి పరుచుకోనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న 6 గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ ధరావతు బుజ్జి బద్దు నాయక్, మాజీ ఎంపీటీసీ జినక వీరయ్య,ఏపీవో మంగమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, కారోబర్ అలవాల యాదగిరి, మాజీ వార్డు మెంబర్లు చాందిని షరీఫ్, అప్పన్న, వీరన్న, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జినక నాగరాజ్, కాంగ్రెస్ నాయకులు జనక ఉపేందర్, సోముల నాయక్, బాలు నాయక్, రావుల వెంకటరెడ్డి, తాళ్లూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల శ్రమకు తగిన గుర్తింపు ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు కాసు మాధవి

నవతెలంగాణ-మహబూబాబాద్

సంరక్షణ, సేవా రంగాల్లో పనిచేస్తున్న అత్యధిక మంది మహిళల శ్రమను గుర్తించడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని మహిళల శ్రమకు తగిన గుర్తింపునివ్వాలని, పురుషులతో సమానంగా వేతనాలివ్వాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు కాసు మాధవి డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఉపాధ్యక్షులు గుగులోతు సరోజ అధ్యక్షతన జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రామిక మహిళల వీరోచిత పోరాటాలకు, సాధించిన విజయాలకు గుర్తింపుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో శ్రమను శ్రమ చేసే మహిళలను బిజెపి ప్రభుత్వం గౌరవించడం లేదని విమర్శించారు. మహిళలకుఉపాధి అవకాశాలు కల్పించాలని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని, డిమాండ్ చేశారు. బీజేపీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపు నిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా నాయకులు దార స్నేహబిందు, బెస్త సంపూర్ణ, గుగులోతు ఝాన్సీ, వడ్లకొండ ఉపేంద్ర, సంధ్యారాణి, సులోచన, మల్లికాంబ, మంగమ్మ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆసరా..

నవతెలంగాణ-గూడూరు

మండలం గాజుల గట్టు గ్రామంలో పాటిమీదిగూడెం ఆదివాసి నిరుపేద అనాథ పిల్లలకు చిరా అశోక్ తన సొంత ఖర్చులతో బియ్యం అందజేశారు. పెనుక శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యంతో మృతి చెందగా ఇద్దరు పిల్లలు పేదరికంతో చాలా ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితి పిల్లలకి మనోధైర్యంగా తన వంతు సహకారం అందించారు.ఈ కార్యక్రమంలో అల్లం చెట్టు శ్రీనివాస్, కోరి దేవేందర్, కుందే కుమార్ స్వామి, దయ్యాల గణేష్, సౌట చేరాలు,కుందే పవన్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

- మున్సిపల్ ఆఫీస్ ముందు సీపీఎం ధర్నా

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణ తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలో ఎప్పుడులేని విధంగా ఫిబ్రవరిలోనే నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. పోయిన సంవత్సరం సరిగా వర్షాలు పడకపోవడం వలన ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి సమస్య ఏర్పడిందన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి మిషన్ భగీరథ ద్వారా పైపులైన్లు వేసి మహబూబాబాద్ పట్టణానికి మంచినీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పి 50 శాతం ప్రాంతాల్లో పైపులైన్లు వేశారు. ఇంకా అన్ని పరిసర ప్రాంత కాలనీల్లో పైపులైను వెయ్యలేదని విమర్శించారు. పాలేరు రిజర్వాయర్ లో నీళ్ల లేవని అవి భగీరథ స్కీంకు సరిపోయే విధంగా లేవని, ఇప్పటికే పట్టణం ప్రజలకు ఇవ్వవలసిన భగీరథ నీటి వాటాలో 40శాతం వాడుకోవాలని పెట్టినట్లు తెలిసింది. ఇదే జరిగితే మొత్తం పట్టణ ప్రజలకు తీవ్ర నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. పట్టణానికి మున్నేరు వాగు నుండి వచ్చే నీటిని అలర్ట్ చేయాలని, బోర్లు, బావులు రిపేరు చేయాలని ట్యాంకర్ల ద్వారా నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల మున్సిపాలిటీని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం నాయక్, పట్టణ కమిటీ నాయకులు రావుల రాజు, హేమ నాయక్, తోట శీను, తజ్జు గౌని వెంకన్న, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



పుస్తక పఠనంతో వ్యక్తి అభ్యున్నతి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత

నవతెలంగాణ-మహబూబాబాద్

పుస్తక పఠనం వ్యక్తిని విజయాల వైపు నడిపిస్తుందని, సమాజంలో ఉన్నత రంగాల్లో ఉన్నవారు ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని నిత్యం అలవాటుగా చేసుకుంటారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయ కాంప్లెక్స్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన 'నవతెలంగాణ' పుస్తక ప్రదర్శన ఎగ్జిబిషన్ గురువారం శ్రీలత ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఎన్ని రకాల విజ్ఞాన సాధనాలు వచ్చినప్పటికీ పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదన్నారు. నిరంతర అభ్యాసనం వ్యక్తులను ఉన్నత శిఖరాలపై నిలబెడుతుందన్నారు. బుక్‌హౌస్ మేనేజర్ బండారి బాబు మాట్లాడుతూ 'నవతెలంగాణ' ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈపుస్తక ప్రదర్శన మార్చి 15 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 8గంటలకు కొనసాగుతుందని తెలిపారు.

కవు లు, కళాకారులు, రచయితలకు 'నవతెలంగాణ' పుస్తక ప్రదర్శన ఆహ్వానం పలుకుతుందన్నారు. ఆయా రకాల పుస్తకాలపై ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు, నవ తెలంగాణ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా మణులకు వందనం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

అన్నింటా తానై అన్ని తానై సమాజంలో ఎదురయ్యే ఎన్నో అవరోధాలను జయించుకుంటూ మహిళా లోకం ముందుకు సాగుతుంది ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో మేము ఎవరికీ తీసిపోమంటూ ప్రతికూలతలలోను అవకాశాలను చేజిక్కించుకుంటూ అన్ని రంగాలలోఅప్రతిహతంగా ముందుకు సాగుతున్నారు. ఆర్థిక సామాజిక సంస్కృతిక రంగాలలో నేడు వనితలు రాణిస్తున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న కేసముద్రం మండలానికి చెందిన మహిళల అభిప్రాయాలు

విద్యతోనే మహిళలకు అభివృద్ధి సాధ్యం : అల్లం రమ వైద్యురాలు



విద్యతోనే మహిళలు అభివృద్ధి సాధ్యమవుతుందని సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే తప్పనిసరిగా ఉన్నత చదువులు అవసరం సమాజంలో మహిళల పట్ల దాడులు దౌర్జన్యాలు అధికంగా జరుగుతున్నాయి. అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలి.అంతేకాకుండా సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలి.సమాజంలో మహిళకు గౌరవ మర్యాదలను ఇవ్వాలి. మహిళలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. నేటి సమాజంలో ఆడపిల్ల బరువు కాదు బాధ్యతగా సృష్టించుకుని సమాజంలో మేటి మహిళగా మనల్ని పొందాలని ఆమె మహిళలను కోరారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయాలలో మహిళలు రాణించాలి : గంధసిరి స్వరూప, అర్పణపల్లి మ్రాజీ సర్పంచ్



మహిళలు రాజకీయపరంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలి. మహిళా సమస్యలపై గళం విప్పేందుకు మంత్రి వర్గాలలో సముచిత స్థానం కల్పించాలి. మహిళలు ఒకరిపై ఆధారపడే స్థాయి నుండి తమ సొంత పరిపుష్టితో జీవించే సామర్థ్యం కలిగి ఉండాలి. అన్ని రంగాల్లో మహిళలు కూడా పురుషులతో సమానంగా ఉద్యోగరీత్యా రాజకీయ విద్యలో రాణిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు మహిళలకు పరిపుష్టిగా ఉన్న వాటి అన్నిటిని ఉపయోగించుకొని పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తున్నారు. మహిళలందరికీ ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి : మెట్టు ఉమాదేవి స్వామి నాధన్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పిజీ) కేసముద్రం మండల చైర్మన్



ఆడపిల్ల కుటుంబానికి భారం కాదు ఆసరాని గుర్తిస్తున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమకంటూ ప్రత్యేక స్థానాన్ని రూపొందించుకుంటున్నారు. గతంలో మహిళలు పొదుపుపై మక్కువ చూపి ప్రస్తుతం కుటుంబాన్ని వెళ్లదీయడానికి మహిళా సంఘాల ద్వారా పొదుపు చేసుకొని మహిళా స్వశక్తిగా ఎదిగి మహిళా సాధికారత సాధించి ప్రస్తుతం మహిళలు మహిళా సంఘాల ద్వారా కాకుండా మహిళా రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా సంఘాలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలను పోషిస్తున్నారు.

అంతేకాకుండా పోటీ ప్రపంచంలో మహిళలు ముందుకు వస్తున్నారంటే స్వయం సహాయక సంఘాలతో పాటు మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ప్రభుత్వం ప్రోత్సహిస్తూ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థకు ఈక్విటీ గ్రాండ్ సమాన పొదుపుకు సమాన సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. పురుషులతో సమానంగా మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థలను కూడా ఏర్పాటు చేసి అన్ని రంగాలలో కూడా మేమున్నామంటూ మహిళలు కంపెనీలను సంస్థలను ఏర్పాటు చేసి స్వయంగా ఉత్పత్తి చేసిన వస్తువులను ప్రపంచ మార్కెట్లో పెట్టడానికి ముందడుగు వేస్తున్నాం. ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.



మహిళా శక్తి ప్రపంచానికే స్ఫూర్తి

- ఎంపీడీవో వేణుమాధవ్

నవతెలంగాణ-పెద్దవంగర

మహిళా శక్తి ప్రపంచానికే స్ఫూర్తిగా నిలుస్తుందని ఎంపీడీవో వేణు మాధవ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లింగ సమానత్వం తోనే సుస్థిరత ఏర్పడుతుందన్నారు.పిల్లల నుంచి పెద్దలవరకు లింగబేధం లేకుండా సమాజస్థాపన జరగాలని, చట్టాలు ఎన్ని ఉన్నా ఎవరికి వారు మార్పు చెంది పరిపక్వంగా ఆలోచించాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, ఆడ పిల్లలుగా పుట్టినందుకు గర్వపడాలని అన్నారు. ప్రకృతితో, దేవతలతో స్త్రీని పోలుస్తారు కాని సమానత్వం ఆలోచన ప్రతీ ఒక్కరికి కలగాలని, స్త్రీని గౌరవించినప్పుడే మనుగడ, అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా సాధికారత, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ పద్మ అంగన్వాడీ టీచర్స్ మంజుల, రేణుక, సరళ, అంబిక తదితరులు పాల్గొన్నారు.



పోగొట్టుకున్న డబ్బు రికవరీ

నవతెలంగాణ-గార్ల

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసం పోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గార్ల-బయ్యారం సిఐ బి. రవికుమార్ అన్నారు. వివరాల ప్రకారం మండల పరిధి లోని రాజు తండా గ్రామానికి చెందిన నూనావత్ రఘురాం అనే యువకుడు 2022 సంవత్సరంలో సైబర్ క్రైమ్ నేరగాళ్ల మాయలో పడి తన బ్యాంకు ఖాతా లోని నగదు పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోగొట్టుకున్న డబ్బుపై విచారణ జరిపి సైబర్‌క్రైమ్ నిందితుల నుంచి రికవరీ చేసిన 48,429 రూపాయల చెక్కును గురువారం బాధితుడికి అందజేశారు. పార్ట్ టైమ్ జాబ్‌లు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, కొరియర్, ఆన్‌లైన్ ఆఫర్లు, బ్యాంకు వివరాల కోసం అపరిచిత వ్యక్తులు ఎవరు ఫోన్ చేసినా భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఒక వేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని, ఘటన జరిగిన రెండు గంటల లోపు సైబర్ క్రైమ్ వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేస్తే మీ డబ్బు ఫ్రీజ్ అయ్యే అవకాశం ఉంటుందని సిఐ రవికుమార్ సూచించారు.



సీసీ రోడ్లు ప్రారంభించిన ఎంపీటీసీ సునిత

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని కాట్రపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన స్థానిక ఎంపీటీసీ, టీపీసీసీ సభ్యులు గుగులోతు సునీత దసురు నాయక్ కాట్రపల్లిలో ఎమ్మెల్యే మురళి నాయక్ ఎమ్మెల్యే సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 10 లక్షల సీసీ రోడ్లు మంజూరయ్యాయి. గురువారం ఈ పనులను దసురు నాయక్ తండాలో స్థానిక ఎంపీటీసీ గుగులోతు సునీత-దసురు నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్వాయి వెంకటరెడ్డి, సిరికొండ మల్లయ్య, మాజీ వార్డు మెంబర్ అంగోతు ఈరు, గ్రామ కమిటీ అధ్యక్షులు యాకాంబరం, ఉపాధ్యక్షులు పుట్ట ప్రభాకర్, చాగంటి యాదగిరి, బూత్ కమిటీ అధ్యక్షులు బారాజు శ్రీనివాస్, బొంత సంపత్, బోదాస్ చంద్రయ్య, జాటోతులాల్ సింగ్, బాదావత్ రాజా, ఆంబోతు శివ, గుగులోతు నరేష్, బౌసింగ్ పాల్గొన్నారు.



ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

- 'గోపా' జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మాటేడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొర్రూరు డివిజన్ గోపా అధ్యక్షులు వికాస్ స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ గౌడ్ ఆర్థిక సహకారంతో మాటేడు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని అందరూ మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అన్నారు. పరీక్ష రాయడానికి అవసరమయ్యే పంచ సూత్రాలను వివరించారు.ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అసోసియేషన్ అధ్యక్షులు కోటగిరి కుమార్ గౌడ్, కంఠమహేశ్వర సంఘ వ్యవస్థాపకులు రావుల యాదగిరి గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు బండారి ఎల్ల గౌడ్, దుబ్బాక శ్రీధర్ రెడ్డి,రాజు, సారయ్య, నాగిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ పరిధిలో చీరల పంపిణీ

నవతెలంగాణ-తొర్రూరు

మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులలోని బూత్‌ల వారీగా కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సీ ఝాన్సీ రాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆడపడుచులకు కానుకగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య మాట్లాడుతూ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, పెదగాని సోమయ్య,గంజి ప్రసాద్ రెడ్డి, అచ్చిరెడ్డి,మెరుగు మల్లేశం, అలువాల సోమయ్య దొంగరి శంకర్, నడిగడ్డ శ్రీనివాస్, కల్లూరి కుషాల్, ముద్దసాని సురేష్, బిజ్జాల అనిల్, శీలం హరిత, జలగం చైతన్య, సంపత్, కె.జితేందర్, సదానందం, నాగరాజు, మధు, సాయి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-గూడూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీరాస్వామి అధ్యక్షతన మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండి కాసిం, గూడూరు-1 ఎంపీటీసీ కత్తి స్వామి, పీడియో కార్యాలయ సూపర్డెంట్ కరెన్సింగ్, కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్, మహిళా కార్యదర్శిలు పాల్గొన్నారు. గాజుల గట్టులో జరిగిన కార్యక్రమంలో సిడిపిఓ నీలోఫర్ ఆజ్మీర్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ రజియా బేగం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మండల కేంద్రంలో జెడ్పీటీఎస్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు.



ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య : గూళ్ళ వెంకటయ్య

నవతెలంగాణ-మంగపేట



ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎక్కటీ సరోజని శేశారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు గూళ్ళ వెంకటయ్య అన్నారు. గురువారం మండలంలోని కమలాపురం ఆర్ఎంసీ పాఠశాల, జెడ్పీ పాఠశాలలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి ఆయన మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో 100కు 93.3శాతం ఫలితాలు సాధించామని 1000 మార్కులకు గాను 982 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ఉచిత విద్యను ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని కోరారు. కళాశాలలో విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో చేర్పించేందుకు అందరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమలాపురం జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రసాద్, లావణ్య, నాగేశ్వరరావు, సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు రేణుకాదేవి, సంతోష్ కుమార్, లక్ష్మణ, అనిల్‌కుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాస్, చిరంజీవి, రాజు, వైష్ణవి, వందన పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-చిట్యాల



బీఆర్ఎస్ నుండి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యం లో మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి రవీందర్ గౌడ్, కైలాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతల శ్వేతా సుమన్, అందుకు తండా గ్రామం మాజీ సర్పంచ్ సిద్ధాంగి భాస్కర్, పాసిగడ్డ తండా మాజీసర్పంచ్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ జవహర్ నాయక్ మండల వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు చెందిన 200 మంది కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కామెడీ రత్నాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మది వంశీకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్‌గౌడ్, నాయకులు గంగాధరి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం








నవతెలంగాణ - ములుగు

స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ములుగు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి శ్రీజతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకొని అన్ని రంగాల్లో అభివద్ధి చెందాలని సూచించారు. నిరాశ నిస్పృహలకు లోను కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను సందర్శించారు. మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను జిల్లాలోని మహిళ ఉద్యోగులు సత్కరించారు. అనంతరం మహిళా ఉద్యోగుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో శక్తిని చాటుతున్న మహిళలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలితా శివజ్యోతి

ములుగు : మహిళలు అన్ని రంగాల్లో శక్తిని చాటుతున్నారని, చట్టాలపై అవగాహనతో మరింత అభ్యున్నతి సాధించొచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ములుగు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మెన్ పీవీపీ లలితా శివ జ్యోతి అన్నారు. గురువారం ములుగు జిల్లా కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పివిపి లలితా శివజ్యోతి పాల్గొని మాట్లాడారు. మహిళలు అక్షరాస్యులైతే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యదర్శి కమ్ సీనియర్ సివిల్ జడ్జి టీ మాధవి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి డి రామమోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె సౌఖ్య, ముఖ్య పరిపాలన అధికారి అనూప్ కుమార్, అదనపు పబ్లిక్ ప్రాస్యూటర్ బి శ్యామ్ ప్రసాద్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేకల మహేందర్, న్యాయవాదులు వేణుగోపాల్ చారి, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం హైస్కూల్‌లో...

గణపురం : మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధి ఎంజీఎం హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ.. ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళలు సాధించిన విజయాలను గౌరవించడానికి, సమాజానికి వారు చేసిన సేవలను గుర్తించడానికి జరుపుకుంటామన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన మహిళకు బహుమతులు అందజేశారు. డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధుకర్ పాల్గొన్నారు.



గంగారంలో...

తాడ్వాయి : మండలంలోని గంగారంలో అంగన్‌వాడీ టీచర్ సుమలత(సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా అభివృద్ధితోనే కుటుంబాలు బాగుపడతాయని ఆమె చెప్పారు. మహిళలు ఆత్మ రక్షణ కోసం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. చౌలేడు(బంజర) అంగన్‌వాడీ టీచర్లు పూనెం విజయ, తేనెకుంట్ల విజయం, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సింగరేణి మహిళలకు ఆటల పోటీలు

కోల్‌బెల్ట్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో గురవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింగరేణి మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం(డీజీఎం పర్సనల్) హాజరై ఆటల పోటీలు ప్రారంభించారు. విజేతలకు నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జీఎం బళ్లారి శ్రీనివాసరావు బహుమతులు అందజేస్తారని తెలిపారు. డీవైపీఎం శ్యాంప్రసాద్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, సేవ కోఆర్డినేటర్ కె ప్రవీణ్, కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటర్ ఉత్తమ్‌కుమార్, సేవా సెక్రటరీ జి లక్ష్మీ సేవా సభ్యులు అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో...

గోవిందరావుపేట : మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసినట్లు ఎంపీడీవో జీ జవహర్ రెడ్డి తెలిపారు. మహిళల రక్షణకు పకడ్బందీగా చట్టాలు రూపొందించాం న్నారు. ఎంపీటీసీలు చాపల ఉమాదేవి, ఏలిసాల స్వరూప, ధారావత్ పూర్ణ, ఆలూరి శ్రీనివాసరావు, గోపి దాస్, ఏడు కొండలు, లావుడియా రామచంద్ర, కార్యాలయ సూపరింటెండెంట్ సాయి దుర్గ లక్ష్మి ఎంపీఓ సాజిదా బేగం, ఏపీఓ ప్రసూన, మహిళా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో...

చిట్యాల : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చిట్యాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ సేవలందిస్తున్న ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొత్తపల్లి రాము అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని కోరారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న అధికారులు సిబ్బందిని సత్కరించి మెమోంటో అందజేశారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి చింతల మహేందర్, ఉపాధ్యక్షుడు కాట్రేవుల ఐలయ్య, కోశాధికారి వెల్దండి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి గుర్రం శంకర్, సలహాదారులు గజనాల మహేందర్, పుల్ల రవితేజ, చింతల రాజశేఖర్, చింతకింది శ్రీనివాస్, సామల ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

మేడారం పరిసర గ్రామాల్లో వైద్య అధికారుల సర్వే



నవతెలంగాణ -తాడ్వాయి

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేవతల మహా జాతర సందర్భంగా సుమారు కోటి 50 లక్షల మంది సందర్శించి దర్శించుకుని వెళ్లారు. దీంతో మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, రెడ్డిగూడెం గ్రామాల్లో కాలుష్య కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గురువారం తాడ్వాయి, కొడిశల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మేడారం, దాని పరిసర 5 గ్రామాల్లో 10 వైద్య బందాలుగా ఏర్పడి, 614 ఇండ్లలో 1473 మందిని స్క్రీనింగ్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 37 మంది జ్వర బాధితులు, 10మంది వాంతులు విరోచనాలతో బాధపడుతున్న వారిని ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. అనారోగ్య సమస్యలుంటే ఆశాలకు కానీ, ఏఎన్ఎంలకు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి రణధీర్, కాటాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి రంజిత్, నాగరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరెడ్డి, సూపర్వైజర్లు సరస్వతి, లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు చేల తిరుపతయ్య, జయరాం, ముత్తయ్య, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ తోనే సుస్థిరాభివృద్ధి: శివయ్య

నవతెలంగాణ-మంగపేట

కాంగ్రెస్ ప్రభుత్వం తోనే రాష్ట్రం సుస్థిరాభివద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యకుడు వల్లిపల్లి శివయ్య అన్నారు. గురువారం మండలంలోని రాజుపేట గ్రామంలో రూ.7లక్షల50వేలతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి సీతక్క చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, బ్లాక్ కార్యదర్శి తుమ్మూరి రాంరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్లు గంట సునీత రామారావు, కోడం బాలకృష్ణ, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు పళ్ళికొండ యాదగిరి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చౌలం వెంకటేశ్వర్లు, మేడారం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ గంగెర్ల రాజారత్నం, గ్రామ అధ్యక్షులు పొట్రూ సమ్మయ్య, మండల సీనియర్ నాయకులు తుమ్మల ముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.

12న ముఖ్యమంత్రి కృతజ్ఞతా సభ

ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు వెంకన్న

నవతెలంగాణ-గోవిందరావుపేట



ఈ నెల 12న హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో జరిగే ముఖ్యమంత్రి కృతజ్ఞత సభకు ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు విడుదల వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో సంఘం సమావేశం సీనియర్ ఉద్యమకారుడు డాక్టర్ హేమాద్రి అధ్యక్షతన జరగగా వెంకన్న హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చేందుకు అంగీకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉద్యమకారులను గుర్తించి వారికి ఇంటి స్థలంతో పాటు గుర్తింపు కార్డు పెన్షన్ సౌకర్యం, ప్రజా పాలన 6 గ్యారంటీలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు సూర్నేని శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కడారి తిరుపతి, మహిళా జిల్లా అధ్యక్షురాలు భక్తుల రాణి, కొన్ని రమేష్, ఆకినపెల్లి రమేష్, దర్శనాల సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

వేస్ట్ మెటీరియల్‌ను పునర్ ఉపయోగించాలి



జాతీయ హరితదళం స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విద్యాసాగర్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

వేస్ట్ మెటీరియల్‌ను పునర్ ఉపయోగించాలని జాతీయ హరితదళం స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి విద్యాసాగర్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ హరితదళం, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేస్ట్ మెటీరియల్ నిరుపయోగ కరమైన మెటీరియల్ను ఉపయోగించి ఒక ఉపయోగ కరమైన వస్తువులను తయారు చేయడం దీని ఉద్దేశం అన్నారు. సుమారు 60 పాఠశాలల నుండి 200 మంది విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ వేస్ట్ పదార్థాలను ఉపయోగించి బెస్ట్ పదార్థాలను తయారు చేసుకో వాలని తెలిపారు. రాష్ట్ర జాతీయ హరితదళ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ బి. విద్యాసాగర్ మాట్లాడుతూ... నిరూప యోగకరమైన వస్తు వులను ఉపయోగించి ఉపయోగకరమైన వస్తువులను తయారు చేసుకొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కాగా మొదటి బహుమతి గణపురం మండలం గాంధీనగర్ సిఎస్ఐ పాఠశాల, రెండో బహుమతి మొగుళ్లపల్లి మండలం మోట్లపల్లి జడ్పిహెచ్ఎస్, మూడో బహుమతిగా కాటారం మండలం ఆదర్శ హై స్కూల్ విజేతలుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్జీసి కోఆర్డినేటర్, జిల్లా సైన్స్ అధికారి బి స్వామి, స్థానిక కేజీవీబీ స్పెషల్ ఆఫీసర్ జయ వసంత లక్ష్మి, న్యాయ నిర్ణేతలుగా బిక్షపతి, కరుణాకర్,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉద్యమానికి మద్దతునివ్వడం నిజమైన దేశభక్తి



రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-భూపాలపల్లి

రైతులకు మద్దతు ధరల హక్కు కల్పిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థంగా మారుతుందని చేసే అసత్య ప్రచారం మానుకోవాలని, రైతు ఉద్యమానికి మద్దతునివ్వడం నిజమైన దేశభక్తి అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన రైతు సంఘం విస్తతస్థాయి సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రాదరపు మల్లయ్యతో కలిసి శోభన్ పాల్గొని మాట్లాడారు. జయప్రకాష్ నారాయణ మద్దతు ధరల హక్కు వల్ల రైతులకు కలిగే మేలుకంటే కీడే ఎక్కువగా ఉంటుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని అన్నారు. మద్దతు ధర నిర్ణయిస్తున్న 23 పంటలకు హక్కును కల్పించాలంటే రూ.10-15 లక్షల కోట్ల భారం ఆర్థిక వ్యవస్థపై పడుతుందని, ఆర్థిక వ్యవస్థ విచ్ఛినం అవుతుందంటూ ప్రచారం చేయడం తగదన్నారు. మార్కెట్, మద్దతు ధరల వ్యత్యాసాన్ని ప్రయివేటు మార్కెట్‌ల ద్వారా రైతులకు చెల్లింపచేస్తే ప్రభుత్వంపై పడే ఖర్చు దాదాపు రూ.50 వేల కోట్ల కన్న మించదని అంచనా వేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఇప్పుడు రూ.47 లక్షల కోటు అని, ఇలాంటి ఆర్థిక వ్యవస్థలో రూ.50 వేల కోట్ల ఖర్చును భరించడం అంత కష్టమేమి కాదన్నారు. రైతుల ఆందోళనలు చేసేది ఇచ్చిన హామీల అమలు కోసమేనని అన్నారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నికల ముందు రైతులు ఆందోళన చేస్తున్నారనేది పూర్తిగా అవాస్తవమని అన్నారు. రైతులు తమ వత్తి మనుగడకోసం, రుణ భారాల నుండి బయట పడి రాజ్యాంగం అంధించిన హక్కులను అనుభవించడానికి ఆందోళన చేస్తున్నారన్నారు. శాంతియుతంగా పోరాడుతున్న రైతు ఉద్యమానికి మద్దతునివ్వడం నిజమైన దేశభక్తికి ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్,రదారపు. మల్లయ్య,రాజేందర్ తదితరులున్నారు.

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలి : జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-భూపాలపల్లి

మంచినీటి పైపు లైన్ లీకేజి, బోరువెల్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఈ నెల 15వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం స్థానికి కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో వేసవిలో మంచినీటి సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మిషన్ బగీరథ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తించిన పనులకు పరిపాలన అనుమతులు తీసుకుని తక్షణమే పనులు చేపట్టాలన్నారు. పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ పంచాయతీల వారిగా అందుబాటులో ఉన్న నిధులపై నివేదికలు అందించాలన్నారు. ప్రాధాన్యతను బట్టి అదనపు నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. వేసవిలో మంచినీటి సమస్య వస్తే ప్రత్యామ్నయంగా మంచినీరు సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, ఆర్ డబ్ల్యుఎస్ ఈఈ నిర్మల, డిఆర్ డిఓ నరేష్, డిపిఓ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్‌గా గండ్ర హరీష్‌రెడ్డి





నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ గా గండ్ర హరీష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్డిఓ మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ సమక్షంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర హరీష్‌రెడ్డిని 16 మంది కౌన్సిలర్ సభ్యులు 27వ వార్డుకు చెందిన కౌన్సిలర్ గండ్ర హరీష్ రెడ్డిని ఎన్నుకున్నారు. గతంలో బీఆర్ఎస్ తరుపున ఎన్నికైన వైస్ చైర్మన్ కొత్త హరిబాబు గత సంవత్సరం డిసెంబర్‌లో రాజీనామా చేయగా వైస్ చైర్మన్ పదవి ఖాళీ అయింది. కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు నడుమ భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది.ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సరైన బలం నిరూపించుకోలేక ఈ ఎన్నికకు హాజరు కాలేదు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు 15, సీపీఐ కౌన్సిలర్ ఒకరు మొత్తం 16మంది ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. హరీష్‌రెడ్డిని వైస్ చైర్మన్‌గా ప్రకటించగా ప్రమాణ స్వీకారం చేశారు.

విజయోత్సవ ర్యాలీ...

గండ్ర హరీష్‌రెడ్డి వైస్ చైర్మన్‌గా అధికారులు ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ భూపాలపల్లి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది.

ఇబ్బందులు పెట్టే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

అధికారం ఉంది కదా అని తమ పార్టీ నాయకులను కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన గండ్ర హరీష్ రెడ్డికి ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టకాలంలో ఎంత మంది ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన, ఇబ్బందులు, బెదిరింపులకు పాల్పడినా ఎదుర్కొంటు నా తన వెంటే ఉన్న కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తూ భూపాలపల్లి మున్సిపాలిటీ పురపాలక సంఘ వైస్ చైర్మన్ పదవిని బీఆర్ఎస్‌రే కానుకగా ఇచ్చిన కౌన్సిలర్లు, సహకరించిన పార్టీ నాయకులకు ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం గండ్ర హరీష్ రెడ్డిని సత్కరించారు. అనంతరం హరీష్ రెడ్డి మాట్లాడుతూ... తనకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతికి కతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజులలో పట్టణ అభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ వెంకటరాణి సిద్దులతోపాటు బిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

పల్లెల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-టేకుమట్ల

పల్లెల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని రామకష్టాపూర్(టి) ఎమ్మార్సీ భవనంలో స్థానిక తహసీల్దార్ కే విజయలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండలంలోని అర్హులైన 30 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని సోమనపల్లి, ఆరేపల్లి, గుమ్మడవెల్లి, రామకష్టాపూర్(వి) గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో గడిచిన 90 రోజులలో 4 గ్యారెంటీలను పూర్తిగా అమలు చేశామని, గత జూలైలో కురిసిన అతి భారీ వర్షానికి 124 చెరువులు తెగిపోగా వాటిని మంజూరు చేయించామని అన్నారు. టేకుమట్ల,రాఘవరెడ్డి పేట చలివాగుపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో ప్రజల సౌకర్యార్థం కోసం రూ.5కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించడానికి కాంట్రాక్టర్‌కు టెండర్ ఇప్పించామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో గ్రామాలలోని మౌలిక సదుపాయాలైన అంతర్గత సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్టు తెలిపారు. మిగతా గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు వైనాల రవీందర్, తిప్పిరెడ్డి కష్టారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, ఉమ్మడి చిట్యాల మండల మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్య, మండల ప్రధాన కార్య దర్శి దాసారపు సదానందం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనెటి రమేష్, మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య, ఆరేపల్లి మాజీ సర్పంచ్ గజ్జి సుజాత రమేష్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు క్రాంతి గౌడ్, దుబ్యాల మాజీ ఎంపీటీసీ సభ్యులు పోలు దాసరి రాజేశం, పార్టీ సీనియర్ నాయకులు తోట గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-టేకుమట్ల



ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అసిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేరవేనా మధుకర్(50) భార్య సారక్క నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటినుండి మధుకర్ మనోవేదనకు గురై మానసికంగా ఇబ్బంది పడుతుండే వాడు. ఈ క్రమంలో తన ఇంటి పక్కన ఉన్న చింత చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు పేరవేన రాజ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ గట్ల సుధాకర్ తెలిపారు.

సీఎం పిఎఫ్ ఆన్లైన్ సబ్మిషన్ శిక్షణా తరగతి

నవతెలంగాణ -కోల్‌బెల్ట్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సీఎం పీఎఫ్ ఆన్లైన్ సబ్మిషన్ శిక్షణా తరగతులు ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారం డీజీఎం(పర్సనల్) అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం ద్వారా సీఎం పిఎఫ్ సెటిల్మెంట్ త్వరగా చేయడానికి అవకాశం ఉంటుందని, శిక్షణా తరగతులను కూలంకషంగా నేర్చుకొని సింగరేణి ఉద్యోగులకు త్వరితగతిన సెటిల్మెంట్ చేసి వారి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివైపీఎంలు శ్యాం ప్రసాద్, క్రాంతికుమార్, డి సంజీవరావు అసిస్టెంట్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.



మహాశివరాత్రికి ముస్తాబైన గణపేశ్వరాలయం

నవతెలంగాణ-గణపురం

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా కోటగుళ్లు ముస్తాబయ్యాయి. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుండి ఆదివారం వరకు ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నేడు శుక్రవారం ఉదయం గణపతి పూజతో కార్యక్రమా లు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం ఏడు గంటలకు శివ కళ్యాణ మహోత్సవం జరగనుంది. కళ్యాణ మహోత్సవ క్రతువును ఆలయ ధర్మకర్త అట్లూరి వెంకట లక్ష్మీనరసింహారావు పావన రాజ్యలక్ష్మి దంపతులు నిర్వహించనున్నారు. శివరాత్రి మహా జాగరణ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం స్వామివారికి మహా అన్నపూజ, ఆదివారం సాయంత్రం శివపార్వతుల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆలయంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మ దంపతులు, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీ పోతరాజు సాయి చైతన్య, కీర్తి దంపతులతో పాటు, పరకాల లలిత నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ లలితాదేవి రాజేశ్వర్ ప్రసాద్, భూపాలపల్లి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోడూరు నవీన్ కుమార్ సుమతి దంపతులు, భూపాలపల్లి సిఐ దుమ్మాటి నరేష్ కుమార్, లక్ష్మి, పెద్దపల్లి ధర్మారం తహసిల్దార్ అంబటి రజిత సురేష్ దంపతులు హాజరుకానున్నారు. శివరాత్రి జాగరణకు వచ్చే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

శివరాత్రికి ముస్తాబైన మల్లన్న గుట్ట

నవతెలంగాణ-మల్హర్ రావు

మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మండలంలోని నాచారం గ్రామపరిదిలో ఆటవిలోగల గుట్టల్లో వెలసిన శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 8 నుంచి 10వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు చేవూరి దేవరాజ్, చేవూరి శివకుమార్ తెలిపారు. 8న శుక్రవారం మహాశివరాత్రి కల్యాణోత్సవం, గణపతి నవగ్రహ లక్ష్మీ రుద్ర హోమాలు, తదతరవి చేపడతారు. 9న శనివారం శ్రీమల్లిఖార్జున స్వామి పెద్దపట్నం, 10న హారతి కంకనోద్యాసన, మహాదశీర్వాదము,తీర్థప్రసాద వితరణ జరుగుతుందని, ఈ మహోత్సవానికి అత్యధిక సంఖ్యలో సందర్శకులు హాజరు కావాలని వారు కోరారు.

మండలంలోని పెద్దతూండ్ల గ్రామంలోని శ్రీహనుమాత్ సహిత శ్రీమద్రాజరాజేశ్వరి పంచాయాతన మందిరంలో నేడు(శుక్రవారం) శివకల్యాణం అంగరంవైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8.30గంటలకు గణపతి పూజ ప్రారంభం నుంచి రాత్రి 12 గంటల వరకు శివ కల్యాణం శోభాయాత్ర, అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 5 గంటల వరకు లింగోధవ పూజ, జగరణం జరుగుతుందని,ఇట్టి మహోత్సవానికి అత్యధిక సంఖ్యలో సందర్శకులు హాజరు కావాలని కోరారు.

మంథని నియోజకవర్గంలో 10,11వ తేదీల్లో మెగా జాబ్ మేళా

హర్షం వ్యక్తం చేస్తున్న యువత

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఉన్నత చదువులు లేదా ఎలాంటి విద్యార్హులు లేకున్నా ఉపాధి కోసం వెంపర్లాడుతున్న నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోంది. మంథని శాసనసభ్యులు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాలతో మంథని నియోజకవర్గంలో 10, 11 తేదీల్లో పెద్ద ఎత్తున మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. మంథని నియోజకవర్గంలో మంథని కేంద్రంగా ఈనెల 10వ తేదీన నసింహ శివ గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు, రెవెన్యూ డివిజన్ కాటారం మండల కేంద్రంలో బీఎల్ఎం గార్డెన్‌లో 11వ తేదీ 10 గంటలకు మెగా జాబ్ మేళాను రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 5 వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు 65 కంపెనీలకు పైగా ప్రతినిధులు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పాల్గొంటున్నాయి.18-35 సంవత్సరాల వయసు కలిగిన యువతీ యువకులు అర్హులు. విద్యార్హతలు 0 నుండి పీజీ వరకు, ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు లేని యువత జాబ్ మేళా లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉద్యోగాలు పొందేందుకు వీలుగా ఐటీ శాఖ మంత్రి గిరిలో శ్రీధర్ బాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్ మేళా నిర్వహించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలని భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సిసెల్ అధ్యక్షుడు దండు రమేష్, ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య, యూత్ నాయకుడు కేశారపు సురేందర్ విజ్ఞప్తి చేశారు.

కోట గుళ్ళ శివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు : సీఐ మల్లేష్‌యాదవ్

నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్లలో నేడు శుక్రవారం జరిగే శివరాత్రి మహోత్సవ వేడుకలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన గణపురం ఎస్ఐ మచ్చా సాంబమూర్తి తో కలిసి కోటగుళ్లను సందర్శించారు. మొదట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇబ్బంది లేకుండా 50మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రామప్పలో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి : అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ- ములుగు



రామప్ప దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం రామప్ప దేవాలయంలో నేటి నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం శ్రీజ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా మహా శివరాత్రి ఉత్స వాలు జరగనున్నాయని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి అన్నారు. ఆలయ ప్రాంగణంలో తాగునీరు వైద్య ఆరోగ్య సదుపాయాలు ఏర్పాట్లు చేయడంలో సంబంధిత అధికారులకు సూచించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు హనుమకొండ, ములుగు, పరకాల కేంద్రాల నుండి రామప్ప దేవాలయం వరకు ఆర్టీసీ బస్సులు ప్రతి 15 నిమిషాలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియాలో సింగరేణి మహిళా ఉద్యోగులు 144

నవతెలంగాణ -కోల్ బెల్ట్



భూపాలపల్లి ఏరియాలో సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులు 5500 మంది కాగా వారిలో మహిళా ఉద్యోగులు 144 మంది. జిఎం కార్యాలయంలో మేనేజర్ స్థాయిలో ఇద్దరు మహిళలు ఐటీ విభాగం మేనేజర్ గా రజిని, ఫైనాన్స్ మేనేజర్ గా సీజే..సురేఖ, సింగరేణి ఏరియా హాస్పిటల్ ఏసి ఎంఓగా డాక్టర్ పద్మజతో పాటు మరో 9 మంది మహిళా డాక్టర్లు సేవలందిస్తున్నారు. వీరితోపాటు కారుణ్య నియామకాలలో ఉద్యోగాలు పొందిన మహిళలు క్లర్కుల గా సుమారు 34 మంది, జనరల్ మజ్దూర్లుగా సుమారు 28 మంది, బదిలీ వర్కర్లుగా 40 మంది పనిచేస్తున్నారు. మహిళా ఉద్యోగులు వివిధ ప్రదేశాలలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో వారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చిన్నపిల్లల తల్లుల కోసం ఫీడింగ్, క్రెచ్ సెంటర్లు, మూత్రశాలలు, ఆసుపత్రులు లాంటి ప్రదేశాలలో డ్రెస్ చేంజింగ్ రూమ్స్ వసతులు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాలు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా యాజమాన్యం దృష్టి సారించకపోవడం విచారకరం. మహిళలు మగవారితో అన్ని రంగాలలో పోటీపడుతూ చివరికి అతి క్లిష్టమైన బొగ్గు రంగంలో కూడా వివిధ హోదాలలో పనిచేస్తున్న క్రమంలో వారిపట్ల యాజమాన్యం ప్రత్యేక దష్టి సారించాలి కానీ వివక్ష తగదని కార్మిక సంఘాలు సూచిస్తున్నాయి. మార్చి 8 శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇకనైనా యాజమాన్యం మహిళల పట్ల సానుకూల దక్పథంతో వ్యవహరించాలని మహిళా ఉద్యోగులు, కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

గుమ్మడిదొడ్డి గ్రామంలో కలెక్టర్ పర్యటన

నవతెలంగాణ-వాజేడు



వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామంలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. గత రెండు వారాలకు పైగా గ్రామంలో ఇంటింటికి జ్వరాలు, కీళ్ల నొప్పులు, వాపులతో బాధపడుతున్న కుటుంబాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి జ్వరాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితుల అడిగి తెలుకున్నారు. వైద్య, పంచాయతీ అధికారులను వ్యాధి నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పెషలిస్ట్ టీం ఆధ్వర్యంలో గుమ్మడి దొడ్డి గ్రామం లో ఇంటింటికి రక్త నమూనాల సేకరణ చేపట్టారు. జిల్లా నుండి వైద్య నిపుణులు డాక్టర్ సతీష్, వ్యాధిగ్రస్తులను రక్త నమూనాను సేకరించారు. ఒక ఇంట్లో వ్యక్తికి జ్వరం,కీళ్ల నొప్పులు, కళ్ళు మంటలు, రేసెస్,వుంటే ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉన్నదని, కుటుంబ సభ్యులు ఆ వ్యక్తికి భౌతిక దూరం పాటించాలని, మాస్కు ధరించాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్, వైద్య నిపుణులు సతీష్, వైద్య అధికారులు కొమరం మహేంద్ర, మధుకర్, రాహిల్, నిఖిల్, సిహెచ్ఓ సూర్యప్రకాశరావు, సబ్ యూనిటీ అధికారి. నరసింహారావు, వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'సెకండ్ ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

నవతెలంగాణ- ములుగు



రాష్ట్రవ్యాప్తంగా సెకండ్ ఏఎన్ఎంల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి, జంపాల రవీందర్ పాల్గొని మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్, పిహెచ్‌సి, యూపీహెచ్‌సిలలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలకు మూడు నెలల నుండి రావాల్సిన పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 33 రకాల రికార్డులను, 33 రకాల యాప్ లను, సైతం పర్యవేక్షిస్తున్నామని కనీసం టీఏ, డీఎలు కూడా మంజూరు చేయడం లేదన్నారు. ఆరు నెలల నుండి రావాల్సిన పిఆర్సి బకాయిలు కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేడారం జాతరలో 24 గంటలు డ్యూటీలు చేసిన రెండవ ఏఎన్ఎంలకు అదనపు వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సెకండ్ ఏఎన్ఎమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పాయం సరోజన జిల్లా ప్రధాన కార్యదర్శి కోడి సుజాత పావని ఆదిలక్ష్మి,సునిత,లలిత, సంపూర్ణ, నాగమణి, కొమురం సుజాత, లక్ష్మి, సుగునావతి, పుష్ప, సరోజిని, వెంకటమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ లోకి పలువురు బీఆర్ఎస్ ప్రముకుల చేరిక

నవతెలంగాణ-రేగొండ

మండల కేంద్రాలతోపాటు మండలంలోని దమ్మన్నపేట పోచంపల్లి గ్రామాలకు చెందిన బీఆఆర్ఎస్ సీనియర్ నాయకులు గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్‌తో పాటు గ్రామానికి చెందిన సుమారు 100మంది బీఆర్ఎస్ నాయకులు, దమ్మన్నపేట మాజీ సర్పంచ్ నడిపెల్లి శ్రీనివాసరావు రేగొండ ఎంపీటీసీ మైస సుమలత బిక్షపతి పోచంపల్లి ఎంపీటీసీ కేసిరెడ్డి ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి చేరగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వారికి కాంగ్రెస్ పార్టీ కండుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామాల్లో ప్రతి కార్యకర్త సైనికుల పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య జిల్లా నాయకులు గుటోజు కిష్టయ్య మేకల బిక్షపతి కొలపక సాంబయ్య, పట్టెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ -తాడ్వాయి

అభివృద్ధి కోసం ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ చేసిన సేవలు మరువలేనివని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఉద్యోగులు కొనియాడారు. గురువారం బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మొదట ఎంపీడీవో ఆంజనేయ ప్రసాద్ కు శాల్వాలు కప్పి, బొకే లు అందించి ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యాంజనేయ ప్రసాద్ మండల అభివృద్ధికి విశేష సేవ అందించి, ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలందరికీ అందించడంలో గడపగడపకు ప్రభుత్వం ద్వారా అభివృద్ధి సేవలను వేగవంతం చేయడంలో సత్యాంజనేయ ప్రసాద్ చేసిన కృషి మరువలేనివని అన్నారు. బదిలీపై వెళ్లిన ప్రదేశంలో కూడా ఆయన మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షాలు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శులు భార్గవ్, శ్రావణ్, మధు, కోరం భాగ్యరాణి, ధర్మేందర్, కోర్నెబెల్లి సతీష్, రమేష్, ఆనంద్, మొదలగు 18 గ్రామ పంచాయతీల కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఊకె ప్రసాద్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సీఐ రాజు

మూడు జిల్లాల వాలీబాల్ క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని స్థానిక సీఐ రాజు అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఏటూరునాగారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారు. ఈక్రీడలను స్థానిక సీఐ రాజు, ప్రముఖ వైద్యుడు వరప్రసాద్ హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం మెరుగుపడుతుందన్నారు. గెలుపు ఓటములు సహజం అన్నారు. ఈ టోర్నమెంట్‌లో 48 టీంలు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, స్పోర్ట్స్ క్లబ్ కోచ్ పర్వతాల కుమారస్వామి, వైద్యులు వెంకటేశ్వర్లు, హెడ్మాస్టర్ సాంబశివరావు, రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మల్లయ్య, వావిలాల కిషోర్, వావిలాల తేజ, పాషా, పీఈటీ రాజు, రవి పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా జిల్లా ప్రజలకు మహా శివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం పండుగ శుభాకాంక్షలు తెలియచేస్తూ ప్రకటన జారీ చేశారు. శివాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రజలు మహా శివరాత్రి పండుగను ఘనంగా జరుపుకుంటారని అన్నారు. జాగారం చేస్తారని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో రోల్ మోడల్ గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన

నవతెలంగాణ-మంగపేట

దళితబంధు రెండో విడత లబ్దిదారులు కళ్లకు గంతలు, జేబుకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ వైఖరి పట్ల నిరసన వ్యక్తం చేశారు. దళిత బంధు సాధన సమితి మండల శాక అధ్యక్షుడు బియ్యం శ్రీను ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రాజుపేట అంబేద్కర్ సెంటర్లో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా దళిత బంధు సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు రాజమల్ల సుకుమార్, కర్రి శ్యామ్ బాబులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలో రెండో విడత లబ్ధి దారులుగా ఎంపికైన తమ పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. రెండో విడతలో విడుదల చేసిన 26.49 కోట్ల రూపాయల దళిత బంధు నిధులు నేటికీ తమ అకౌంట్లల్లో జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వెంటనే తమ అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి ఉపాధ్యక్షుడు జానపట్ల జయరాజుదళిత బందు లబ్ధిదారులు పాల్గొ న్నారు.

మేడారంలో పారిశుధ్య పనులు ముమ్మరం

స్థానిక పంచాయతీ కార్యదర్శి సతీష్

నవతెలంగాణ- తాడ్వాయి

మేడారం మహా జాతరకు వనదేవతలను ధరించుకునేందుకు రాష్ట్ర సరిహద్దు రాష్ట్రాల నుండి దేశ నలుమూలల నుండి ముందస్తుగానే లక్షలాది మంది తరలి వచ్చి, వనదేవతల దర్శనం చేసుకున్నారు. మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి విందు భోజనాలు ఆరగించి చెత్త పదార్థాలను అక్కడే వదిలి వెళ్లారు. మేడారం దాని పరిసర గ్రామాల్లో పారిశుధ్యం వ్యాపించి ఉంది. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీష్ దగ్గర ఉండి పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మేడారంలోని ఆర్టీసీ బస్టాండు, మేడారం ఇంగ్లీష్ మీడియం చిలకలగుట్ట గద్దెల ప్రాంగణం, రెడ్డిగూడెం, జంపన వాగు చింతల క్రాస్ ప్రదేశాలలోని విసర్జక పదార్థాలను తొలగించుకుంటూ, బ్లీచింగ్ పౌడర్ ను డస్టింగ్ చేస్తున్నారు. డ్రైనేజీలలో ఉండే చెత్త చెదారాన్ని తొలగిస్తున్నారు.

పట్టు వస్త్రాలు బహూకరణ

నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గణపేశ్వర స్వామి వారికి గణపురం మండల కేంద్రానికి చెందిన పింగిలి సూర్యమ్మ రమేష్ చందర్ రెడ్డి దీప్తి సాధన్ రెడ్డి దంపతులు రూ.30 వేల తో స్వామివారికి పట్టు వస్త్రాలను బహుకరించారు. ప్రతి ఏడు స్వామివారికి సంవత్సరానికి సరిపడా వస్త్రాలను బహుకరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా వారు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు అనంతరం ఆలయ అర్చకులు నరేష్ వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయానికి పట్టు వస్త్రాలను బహుకరించిన పింగిలి కుటుంబ సభ్యులకు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

లక్ష్మారెడ్డిపల్లిలో సీసీ రోడ్డుపనులు ప్రారంభం

నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం లక్ష్మారెడ్డి పల్లి లో గురువారం సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షఉపాధ్యక్షులు వీరమల్ల సంపత్‌రెడ్డి మామిడాల విజయ్ కుమార్ ప్రారంభించారు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంజూరు చేసిన నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్నల కుల సంఘమ్ అధ్యక్షులు మొగిలి ఓదెలు గాదె ఉపేందర్ వీరారెడ్డి, మొగిలి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన భాండాగారానికి దాతృత్వాన్ని చాటిన పద్మ ప్రసాద్‌రావు దంపతులు

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలం జూకల్ ఉన్నత, పాఠశాల తరగతి గ్రంథాలయాలకు ఆరు బీరువాలు, ప్రాథమిక పాఠశాలకు రెండు మొత్తం 8 బీరువాలు అందించి పాఠశాల విద్యార్థులలో పఠన అభిలాషను పెంపొందించడానికి చెరుకు పద్మ ప్రసాద్ రావు దంపతులు కృషి చేశారు. అలాగే వార్షిక పరీక్షల్లో మొదటి స్థానం పొందిన విద్యార్థులకు రూ.12వేల నగదు అందించారు. ఎంపీటీసీ జంబుల తిరుపతి, ఎక్స్ సర్పంచ్ పుట్టపాక మహేందర్ , హనుమను సేవా సమితి సాయిరెడ్డి, టి న్యూస్ భూపాలపెల్లి ఇన్చార్జి మాటూరి రవిగౌడ్ పద్మ ప్రసాద్ రావు దంపతుల సేవలను కొనియాడుతూ వారిని పూలమాలులతో శాలువాలతో సత్కరించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రసాద్‌రావు సేవలను కొనియాడారు. విద్యార్థుల పఠన అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు రాధిక రాణి సమ్మయ్యఎ మమత, ఉమాదేవి, గిరిజ, వాసవి, రంజిత్ కుమార్, రూప, రూపశ్రీ, రఫీ, మాధవి , సునీత యోగనందా చారి, సాంబరాజు అభినందించారు.

అధునాతన పరికరాల వితరణ

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చల్వాయి కి పరకాల మండలం రాయపర్తి గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ దంపతులు రాచర్ల శ్రీకాంత్, మాధవిలు గురువారం దాదాపు రూ.20వేల విలువచేసే అధునాతన ఫైవ్ జి నెట్వర్క్ వైఫై రూటర్ మరియు సెటప్ బాక్స్ పాఠశాలకు బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గొంది దివాకర్ మాట్లాడుతూ అన్ని తరగతుల విద్యార్థులకు అధునాతన డిజిటల్ టెక్నాలజీ తరగతుల బోధనకు మార్గం సులువు అయినదని అన్నారు. చల్వాయి గ్రామం రిటైర్డ్ టీచర్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు కళ్యాణపు రమేష్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాచర్ల శ్రీకాంత్-మాధవి ఇంతకుముందు అధునాతన సౌకర్యం గల ప్రొజెక్టర్ ఎల్ఈడి స్క్రీన్ తదితరవి బహుకరించినట్టు చెప్పారు. ఇంటర్నెట్ సౌకర్యాన్ని పాఠశాలకు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయులు పి శివ నాగేశ్వరరావు, ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టేందుకు ఐక్యంగా పనిచేయాలి

- వడ్డేపల్లి మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని



నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టేందుకు వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హనుమకొండ వడ్డేపల్లి మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని పిలుపునిచ్చారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా వడ్డేపల్లి పింగిలి మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి సుహాసిని గురువారం మాట్లాడుతూ మహిళలపై హింస అనేది ప్రపంచవ్యాప్తంగా విస్తతంగా లోతుగా వేళ్లూనుకున్న సమస్య అని ఇది శారీరక, లైంగిక, భావోద్వేగ ఆర్థిక దుర్వినియోగం వంటి వివిధ రూపాల్లో వ్యక్తమవుతుందన్నారు. ఈ సంక్లిష్ట సమస్యను అధిగమించడానికి వ్యక్తులు, సంఘాలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడంఅవసరం ఉందన్నారు. మహిళలపై హింసకు గల మూల కారణాలను అర్థం చేసుకోవడం చాలా కీలకమని నైతిక విలువలతో కూడినవిద్యను ప్రోత్సహించడం చాలా అవసరమన్నారు. సమగ్ర లైంగిక విద్య వ్యక్తులు సంఘాలపై హింస ప్రభావం గురించి అవగాహన పెంచడానికి ప్రచారాలు, ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగసమానత్వాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు ఉండాలన్నారు. మహిళల హక్కులను రక్షించడానికి నేరస్తులను జవాబుదారీగా ఉంచడానికి బలమైన చట్టపరమైన విధాన ఫ్రేమ్‌వర్క్‌లు అవసరం అన్నారు.

గృహహింస, లైంగిక వేధింపులు ఇతర రకాల లింగ-ఆధారిత హింసకు వ్యతిరేకంగా చట్టాలను రూపొందించడం, అమలు చేయడం, అలాగే నివేదించడం న్యాయం కోరడం కోసం చేయగల మార్గాలను అందించడం మొదలగు వాటి పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రాణాలతో బయటపడిన వారికి సమగ్ర సహాయ సేవలను అందించడం చాలా కీలకం ఇందులో షెల్టర్‌లు, హాట్‌లైన్‌లు, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, హింస నుండి బయటపడిన వారి అవసరాలకు అనుగుణంగా ఆరోగ్య సంరక్షణ సేవలు ఉన్నాయన్నారు. మహిళలను ప్రోత్సహించడం వలన మహిళలను ఆర్థికంగా సామాజికంగా సాధికారత కల్పించడం వల్ల హింసకు గురయ్యే అవకాశం తగ్గుతుందని సుహాసిని పేర్కొన్నారు.

15

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

హనుమకొండ

శుక్రవారం | మార్చి 08, 2024 | www.navatelangana.com

ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు









నవతెలంగాణ-హనుమకొండ

సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కార్మికుల శ్రమను గౌరవించాలని సీఐటీయూ, టిఎస్ఆర్టిఎస్ డిమాండ్ చేసింది.అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా గురువారం సీఐటీయూ-టీఎంఆర్‌పీఎస్ మున్సిపల్ యూనియన్ల ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. హనుమకొండ అశోక జంక్షన్ నుండి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వరకు మున్సిపల్ మహిళా కార్మికులతో ప్రదర్శన నిర్వహించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వరుపట్ల మహేష్, టిఎంఆర్‌పిఎస్ మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు మున్నంగి రఘుల అధ్యక్షత వహించగా అనంతరం సన్మాన సభ జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభకి ముఖ్యఅతిథులుగా హాజరైన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేశం మాట్లాడుతూ సిఐటియు, టి ఎమ్ ఆర్ పి ఎస్ మున్సిపల్ యూనియన్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం, శ్రమను గౌరవిస్తూ శ్రమను, ప్రోత్సహిస్తూ, మున్సిపల్ డివిజన్లో నెలలో ఒక్కరోజు కూడా ఆబ్సెంట్ లేని మహిళా కార్మికులను డివిజన్ కి ఒక్కరిని గుర్తించి సుమారు 36 మందిని శాలువాలతో సన్మానించడం మంచి పరిణామం అన్నారు. వాస్తవంగా మున్సిపల్ కార్మికులు ఈ సమాజంలో అత్యున్నతమైన పాత్రను పోషిస్తూ, తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి, నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న, మీలాంటి మహిళ తల్లులకు ఈ మహిళా దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియ జేస్తున్నామన్నారు. ఈ సభకి ఉపన్యాసకులుగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షుడు టి ఉప్పలయ్య, టిఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ల బిక్షపతి, మున్సిపల్ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ ధర్మరాజు, సిఐటియు జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ ఎన్.రజిత, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయశ్రీలు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో టీఎంఈడబ్ల్యూఏ నాయకులు బొట్ల రమేష్, రాజారపు భాస్కర్, సిఐటియు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు యాస బాబు, ఎం నవనీత, కృష్ణస్వామి, నరేష్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి : దాస్యం

ఇంటి కీర్తిని పెంచే శక్తికి మహిళలపై ఉందని మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించినప్పుడే దేశం పురోగమిస్తుందని మాజీ చీఫ్ విప్ భరాస జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ మహిళ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై మాట్లాడుతూ మహిళలకు గతంలో అనేక సేవలు అందించామని ఈ సందర్భంగా తెలిపారు.ఇంటి కీర్తిని పెంచే స్త్రీ శక్తికి వందనమని అన్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు సభాధ్యక్షత వహించగా, కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ సతీమణి దాస్యం రేవతి భాస్కర్ ,మహిళా కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి,నల్లా స్వరూపారాణి,మాజీ కార్పొరేటర్లు అరుణ శ్రవణ్ కుమార్, మణి, ప్రమీల, సరస్వతి, హైమావతి, దీప్తి, పూర్ణిమ, ఉమారెడ్డి, రజిత, జ్యోతి, అయేషా, మౌనిక, మహిళ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాలి :

వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.రాధాదేవి

ఎన్జీవోస్ కాలనీ : మహిళలు హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనివరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.రాధాదేవి పిలుపునిచ్చారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ-చైర్మన్ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి ఆధ్యక్షతన కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా న్యాయమూర్తులకు, కోర్టు మహిళా ఉద్యోగినులకు గురువారం ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తులు మాట్లాడుతూ అంతర్జాతీయంగా మహిళలు తమ హక్కులను గుర్తించి మహిళా సమానత్వం, సాధికారత, సామాజిక మార్పుపై అవగాహన తోపాటు వీటి సాధనకోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని గుర్తుచేసుకునే రోజే మహిళా దినోత్సవం అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థలు,పలు సామాజిక సంస్థలు వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో మహిళలు సాధించిన విజయాలను గురించి వివరించి, వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

లింగ సమానత్వం, సమాజంలో మహిళల పాత్ర, మహిళలపై వేధింపులు, మహిళలకు సమాన హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. మహిళా న్యాయమూర్తులకు, ఉద్యోగినులకు ప్రధాన న్యాయమూర్తులు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల మహిళా న్యాయమూర్తులు మనీషా శ్రవణ్ ఉన్నమ్, బి.అపర్ణా దేవి, వై.సత్యేంద్ర, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్, న్యాయమూర్తులు, కోర్టు మహిళా ఉద్యోగినులు పాల్గొన్నారు.

ఏకశిల హై స్కూల్ లో ...

హనుమకొండ చౌరస్తా : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వేడుకలను హనుమకొండ కేయూసీ రోడ్‌లోని ఏకశిల హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మహిళల గొప్పతనం, మహిళా సాధికరత, సమాజం పట్ల మహిళలకు ఉన్న భాధ్యత గురించి ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో మహిళల పట్ల ఉన్న వివక్షను తొలగించడమే మహిళా దినోత్సవం ప్రధాన లక్ష్యం అన్నారు. విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజి వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తున్నప్పటికీ ఇంకా అక్కడక్కడ మహిళపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని అలాంటి సంఘటనలను నియంత్రించేందుకు కఠిన చట్టాలను తీసుకువచ్చినా అవి నిర్వీరమైపోతున్నాయని అందుకు గల కారణాలను గుర్తించాలన్నారు. భవిష్యత్తు తరాలైన నేటి బాలికలు కూడా అన్ని అవకాశాలను వినియోగించుకోని, అన్ని రంగాలలో రాణించేందుకు ఇప్పటి నుండే కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళలందరికి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏకశిల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంలో...

చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీలు అనేక కార్యక్రమాలను, ఆట పాటలతో, సాహితి, సాంస్కృతిక కార్యకలాపాలలో ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ సి.మమతా రెడ్డి, ప్రముఖ హృద్రోగ చికిత్స ప్రవీణురాలు హాజరై మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని సాధించడం కేవలం మహిళలకే కాకుండా మొత్తం సమాజానికే మేలు చేస్తుందని దీని వల్ల ఆర్థిక వద్ధి, అభివద్ధి మెరుగైన కుటుంబ జీవిత ఫలితాలకు దారితీస్తుందన్నారు. లింగ సమానత్వానికి మనందరి సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. చైతన్య విశ్వవిద్యాలయంలో ఈ మహిళా బృందం నిర్వహించుచున్న అనేక వేడుకలకు తాను పాల్గొనడం చాలా సంతోష దాయకంగా వుందని మమతా రెడ్డి తెలిపారు. ఈ మహిళా దినోత్సవాన్ని మా చైతన్య విశ్వవిద్యాలయ మహిళా బందం నిర్వహించినందుకు చాలా సంతోషంగా ఉందని కులపతి డాక్టర్ సిహెచ్‌వి.పురుషోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి, ఉపకులపతి ప్రొఫెసర్ జి. దామోదర్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ రవీందర్ గాదె రాంబాబు, ప్రజా సంబంధాల అధికారి తదితరులు పాల్గొన్నారు.

నడికుడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవంలో భాగంగా చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ సమాజ పురోగతికి మహిళల పాత్ర ఎనలేనిదని, మహిళలు లేనిదే సమాజం లేదని, ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న నిగ్గుల శ్రీదేవినీ, పంచాయతీ కార్యదర్శి స్వేతను, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, విద్యా వాలంటీర్ పరివెని జ్యోతి, ఎస్ఎంసి చైర్మన్ అమ్మ హారిక, మధ్యాహ్న భోజన నిర్వాహకులు తాళ్లపల్లి సరోజన, అంగన్వాడి ఆయాలు అరుణ, శనిగరం సుశీలను ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం చర్లపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి శ్వేత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీటీసీ నందికొండ సుగుణ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోలంపల్లి విజేందర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపట్ల వివక్షత తొలగిపోవాలి : ఎంపీపీ

ఆత్మకూరు : మహిళలపట్ల వివక్షత తొలగిపోయినపుడే సంపూర్ణ సాధికారత సాధ్యమవుతుందని ఆత్మకూరు ఎంపీపీ మార్క సుమలత అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆమె 'నవతెలంగాణ'తో మాట్లాడారు. మండలంలోని హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన మార్క సుమలత మండల పరిషత్ అధ్యక్షురాలు గా ఐదు సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్నారు. ఎంపీపీ గా ఉంటూనే ఇటు కుటుంబాన్ని అటు మండల ప్రజానీకాన్ని పరిపాలన దీక్షతో ప్రజల సేవే కు తపిస్తూ ప్రజా పాలనా కొనసాగిస్తూ... మచ్చలేని నాయకురాలు గా ఎంపీపీ గా కొనసాగుతున్నారు. సభలు సమావేశాలు నిర్వహించడంతో పాటుగా ప్రభుత్వం మహిళల కోసం రూపొందించిన చట్టాలు, హక్కులు, వంటి అంశాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో 1951 సెప్టెంబర్ 27 రోజున హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టి మహిళల హక్కుల గొంతుక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ విద్యా ఉద్యోగ రంగాలలో ఉండాలని ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో మహిళలు అత్యున్నత స్థానానికి ఎదగాలని ఆశించిన మహానుభావుడని కొనియాడారు.రానున్న రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెంది దేశ, రాష్ట్ర పురోగతికి తోడ్పాటు అందించాలని ఆమె సందర్భంగా మహిళలను కోరారు. ఈ సందర్భంగా మహిళల మణులకు మహిళా దినోత్సవ, మహా శివరాత్రి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

శాయంపేట : మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. 2024 ప్రచార థీమ్ ఇన్స్పైర్ ఇంక్లూజన్ డైరెక్టర్ మామిడి అనురాధ వివిధ రంగాలలో చేసిన సేవలను, విజయాలను గుర్తించి పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సౌమ్య, సంధ్య, జయ, మౌనిక, మాధవి, సుమలత, స్వాతి, ప్రసూన, శివ, సందీప్, రాజేందర్, వెంకట్ పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో

నయీంనగర్ : మహిళా అభివృద్ధి తోనే దేశాభివృద్ధి సాధ్యమని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్ లో విశ్వవిద్యాలయ మహిళా అధ్యయన కేంద్రం, వేదన, యాంటి సెక్సువల్ హెరాస్మెంట్ సెల్ సంయుక్త నిర్వహణలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు -2024 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్థిక, రాజకీయ, సామజిక చైతన్యం ద్వార సాధికారతా సాధ్యం అని పూలే దంపతులు, స్త్రీ సంస్కరణవాదుల సేవలు మరువలేనివి అని, మహిళా సేవలు విలువకట్టలేనివన్నారు. విశ్రాంత తెలుగు ఆచార్యులు కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ కేయూలో మహిళల పై గొప్ప పరిశోధనలు జరిగాయి అని, ఆ పరిశోధనల ఫలితమే 9వ ప్రణాళిక లో మహిళా అధ్యయన కేంద్ర స్థాపన జరిగిందన్నారు. ఒక మహిళా జ్ఞానవంతురాలైనపుడే ఆ కుటుంబం జ్ఞానవంతం అవుతుందన్నారు. మహిళా హక్కుల పై పోరాటం జర గాలి, చైతన్యం రావాలి, నేటికి సమాజం లో వైషమ్యాలు ఉన్నాయి అన్నారు. మహిళా అధ్యయన కేంద్ర సంచాలకులు డాక్టర్ బి.దీపా జ్యోతి మాట్లాడుతూ ప్రతి మహిళా తనకు తాను గుర్తించి గర్వపడాలన్నారు. వేదన, యాంటి సెక్సువల్ హెరాస్మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ ఆర్.మేఘనరావు మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళల హక్కులు, లైంగిక వేధింపులు కిందికి వచ్చే అంశాలు వివరిం చారు. ఈ సందర్భంగా ఆచార్య కాత్యాయనీ ని శాలువా, జ్ఞాపిక తో సన్మా నించా రు. ఈ కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్ : కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ముందస్తు మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడవారి పట్ల వివక్షత చూపరాదని అన్నారు. అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని గుర్తు చేశారు. మహిళలకు చదువుతోపాటు కరాటే లాంటి విద్యలను కూడా నేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజ్, డాక్టర్లు విజిత, రవి, వరుణ్,భాను చందర్, వరుణ్,హెడ్ నర్స్ జ్యోతి, నర్సింగ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో...

ఎన్జీవోస్ కాలనీ : మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ విభాగాధిపతి డాక్టర్ స్నేహలత రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక న్యాయమూర్తి రాధాదేవిని ముఖ్యఅతిథిగా మరొక న్యాయమూర్తి సత్యేంద్రను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి సుహాసిని అధ్యక్షత వహించారు అధ్యక్ష ఉపన్యాసంలో సుహాసినీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాధాదేవి మాట్లాడుతూ మహిళలకు చట్టపరంగా లభించే అటువంటి వివిధ భద్రతా చర్యలను తెలియజేశారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ స్నేహ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే ఏదైనా చేయగలరని అన్నారు. డాక్టర్ డి రామకృష్ణారెడ్డి,కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. పార్వతి ఇతర అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.











మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆత్మకూరు : మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన ముప్పరపు హల్యమ్మ అనారోగ్యంతో ఇటీవలే మతి చెందింది. గురువారం రాష్ట్ర యూత్ నాయకులు రేవూరి రణధీర్ హల్యమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శించి 5వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మోర్ నగేష్, మాజీ సర్పంచ్ బూర రాజేందర్, మరియు మిరియాల కుమార్, కొమ్ముల శ్రవణ్, గుండెబోయిన అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బేకరిని ప్రారంభించిన ఎంపీడీవో

నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన శ్రీ రూప బెంగళూరు బేకరిని గురువారం ఎంపీడీవో ఫణీచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాయంపేటలో భారీ ఎత్తున బెంగళూరు బేకరీ ఏర్పాటు చేయడం హర్షణీయమని బేకరీ యజమాని సందేశ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వినుకొండ శంకరాచారి, పరకాల రఘు, రాజేందర్, ఉప్పు నరసయ్య, గిద్దేమారి రామన్న, సమ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు

నడికుడ : మండలంలోని సర్వపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భోగి చెన్నయ్య, కుర్ల రాజేందర్ ల ఆధ్వర్యంలో దండు సాంబయ్య, భోగి లక్ష్మణ్‌లతో పాటు 40 మందికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాపాలన సేవ కేంద్రం ఏర్పాటు

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఫణీచంద్ర తెలిపారు. గురువారం ఎంపీడీవో చాంబర్లో ఆయన చాంబర్లో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద రూ.500లకు గ్యాస్ రీఫిల్లింగ్, గహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వినియోగదారులకు ఉచిత విద్యుత్ కొరకు సలహాలు, సూచనలు కేంద్రంలో అందించడం జరుగుతుందని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తులలోని తప్పిదాలను సేవ కేంద్రంలో సవరించుకోవాలని ఆయన తెలిపారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



ఆత్మకూరు : కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని ఎంపీపీ మార్క సుమలత రజనీకర్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయానికి ఎంపీపీ నిధులతో ప్రహరీ గోడ రూ.4.6 లక్షల పనులకు జెడ్పీటీసీ కక్కేర్ల రాధికరాజుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు కమలాపురం రమేష్, భయ్యా రామ రాజు, బొమ్మగాని భాగ్యరవీందర్, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, రాష్ట్ర నాయకుడు రేవూరి రణధీర్ రెడ్డి, డైరెక్టర్ జైపాల్ రెడ్డి, అలువాల రవి, ఎండి ఖాజా, ఎండి అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దగ్ధం



నవతెలంగాణ-హన్మకొండ

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో బీఎస్పీ పార్లమెంట్ ఇన్చార్జి మంద శ్యామ్ ఆధ్వర్యంలో మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంద శ్యామ్ మాట్లాడు తూ గుండాయిజం గురించి మంత్రి కొండా సురేఖ మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎవరి కుటుంబం రాజకీయానికి రొంపుగా ఉన్నారో ప్రజలకు తెలుసునన్నారు. స్వార్థ రాజకీయాల కోసం గుండాయిజం పేరిట బహుజన అమాయక బిడ్డలను వాడుకొని బలితీసుకున్న చరిత్ర కొండా దంపతులదేనన్నారు. ఓరుగల్లుకు రక్తపు మరకల చరిత్ర పైన మీ రౌడీయిజం పాత్ర లేదా అని ప్రశ్నించారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఒక బహుజన బిడ్డగా ప్రజల గుండెల్లో వెలుగుతున్న సం దర్భంలో ఒక బహుజన అధికారి రాజకీయ భవిష్యత్తు నాశనం చేయడానికి రాష్ట్రంలో రాబంధులు, రాజ్యాధికార వ్యతిరేక చెంచాలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ఇంచార్జీలు కన్నం సునీల్, వరంగల్ జిల్లా మహిళా కన్వీనర్ రాజేశ్వరి, తూర్పు మహిళా కన్వీనర్ మౌనిక, సుమలత, పుష్పితలయ, బస్కే నాగరాజు, రాహుల్, కిషోర్, వేణుగోపాల్, నితిన్ మినాజ్, చింత సియోన్, జన్ను అనిల్, ధనరాజ్, గజ్జి దయాకర్, లెనిన్, బహుజన నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగట్టాలి : చల్లా

నవతెలంగాణ-పరకాల / ఎన్‌జీవోస్ కాలనీ

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం హన్మకొండలోని నివాస కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసం పార్టీలు మారే వారితో నష్టమేమీ లేదన్నారు . పార్టీ నుంచి ఎందుకు వెళ్ళామా అని వారు తమకు తామే గుర్తు చేసుకునే రోజులు దగ్గర్లోనే ఉందన్నారు. పార్టీ శ్రేణులు అధైర్య పడవద్దని పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. నాయకులను, కార్యకర్తలను బెదిరింపులతో పాల్పడుతూ పార్టీ మారాలంటే బలవంతపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో ఐదుగురికి చోటు

సుబేదారి : తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర వాణిజ్యం విభాగం పూర్తిస్థాయి కమిటీని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆదేశానుసారం నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం పూర్తిస్థాయి కమిటీని ప్రకటించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ వరంగల్ పార్లమెంటు అధ్యక్షుడు అర్షణపల్లి విద్యాసాగర్ రావు తెలిపారు. రాష్ట్ర కమిటీ లో వరంగల్ పార్లమెంటు నుంచి ఐదుగురికి అవకాశం కల్పించారని అన్నారు. వారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలమాల మహేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అని శెట్టి సతీష్,రాష్ట్ర కార్యదర్శి గా తౌటమ్ సంపత్, బైరి శేషాద్రి,మేకల సుధాకర్ అని తెలిపారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆశయాలను పూర్తినిబద్ధతతో పేద ప్రజలకు అందేలా ప్రయత్నం చేస్తామన్నారు. వారిని అర్శనపల్లి విద్యాసాగర్ రావు అభినందించారు.